



ఉష్ణోగ్రత (అంచనా)

16-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	34	28
తెనాలి	34	28
నరసరావుపేట	34	27
బాపట్ల	36	28
రెంటచింతల	34	27
చీరాల	36	28

చినుకు రాలదాయె!

- 59 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- పంటల సాగు తడబాటు
- తొలకరి కోసం రైతుల ఎదురు చూపులు
- సాగుకు సిద్ధం చేసిన భూములు
- ఆందోళనలో అన్నదాతలు

మూడు జిల్లాల్లో పంటల సాగు ఇలా..

మూడు జిల్లాల్లో వరి, పత్తి, మిరప, కంది, పొగాకు విస్తృతంగా సాగు చేస్తారు. ప్రధాన పంటల సాగుకు వాతావరణం అనుకూలించడం లేదు. మెట్ట పైర్లు సాగుకు పొలాలను రైతులు దుక్కి చేసుకున్నారు. వరి సాగు కోసం దుక్కులు దున్నేందుకు సాహసం చేయడం లేదు. వర్షాభావం ఇలానే కొనసాగితే సాగుకు గడ్డు కాలమేనన్న అందోళన అన్నదాతల నుంచి వ్యక్తమవుతోంది.

మేరికపూడి ప్రాంతంలో విత్తనం విత్తేందుకు అచ్చు తొలుతున్న రైతు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రోహిణిలో ఊరించిన వర్షాలు.. మృగశిరలో ముఖం చాటేశాయి. మృగశిరకు స్వాగతం పలుకుతూ అన్నదాతలు కోటి ఆశలతో ఉత్సా హంగా ఏరువాక సాగారు. పొలాలను దుక్కులు దున్ని సాగుకు సమాయత్త మయ్యారు. కానీ, చినుకు రాలక పోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నా రు. వర్షాలు కురవక పోవడంతో పంటల సాగు జాప్యం అయ్యే పరిస్థితులు ఏర్ప డ్డాయి. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవడం, ప్రాజెక్టులు నిండటంతో పంట లను విస్తృతంగా రైతులు సాగు చేశారు. వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా అక్కడక్కడ చిరు జల్లులు తప్పా పంటల సాగుకు అనుకూలమైన వర్షాలు కురవలేదు.

మూడు జిల్లాల్లోని 59 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. పల్నాడు జిల్లాలో 28 మండలాలకు గాను ఒక్క మాచర్లలో మాత్రమే అత్యధిక వర్షపాతం నమోదైంది. 16 మండలాల్లో అత్యధిక లోటు, 8 మండలాల్లో లోటు, మూడు మండలాల్లో సాధా రణ వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో 40 మి.మీ సాధారణ వర్ష పాతం నమోదు కావాలి. అయితే ఇప్పటికి 18.2 మి.మీ వర్షపాతం నమో దైనట్లు వాతావరణ (మిగతా 6వ పేజీలో)

రైస్ కార్డు దరఖాస్తుల వెల్లువ

- గుంటూరు జిల్లాలో వచ్చినవి 40,002
- ప్రభుత్వం ఓకే చేసినవి 21,186
- పెండింగులో ఉన్నవి 16,266
- తిరస్కరించినవి 2,550

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రైస్‌కార్డులకు గుంటూరు జిల్లాలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇప్పటి వరకు 40 వేలకు పైగా వచ్చాయి. ఇంకా చాలా సచివాలయాల్లో దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. గడిచిన 15 రోజులుగా ఈ ప్రక్రియ నడుస్తున్నా.. సర్వర్ సమస్యలతో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు రైస్ కార్డులకు 40,002 దరఖాస్తులు రాగా.. వాటిలో 21,186 ఆమోదం పొందాయి. 16,266 పెండింగులో ఉన్నాయి. 2,550 తిరస్కరణకు గురయ్యాయి.

● మార్పులు, చేర్పులే అధికం

జిల్లాలో వచ్చిన దరఖాస్తుల్లో కొత్త పేర్ల చేర్పు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులే ఎక్కువ. రేషన్ కార్డులో పేర్ల చేర్పునకు సంబంధించి 25,894, కొత్త రేషన్ కార్డుల కోసం 6,185, కార్డు విభజన కోరుతూ 3,554, చిరునామా మార్పు కోసం 2,255, పేర్ల తొలగింపునకు 1,782, ఆధార్ సీడింగ్, వివరాలు సరిచేసుకునేందుకు 451, షాపు రెన్యువల్ కోరుతూ 12, కార్డు సెరెండర్‌కు 9 దరఖాస్తులు వచ్చాయి.



తక్కెళ్ళపాడులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ యుగ పురుషుడని, మహానటుడని, ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే ఒక బ్రాండ్ అన్నారు. ఆయన సినీ రాజకీయ రంగాల్లో తిరుగు లేని పేరు గడించారని పేర్కొన్నారు.

4,500 మందికి స్థానచలనం

- ముగిసిన ఉపాధ్యాయుల బదిలీ, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్
- బదిలీల్లో మున్సిపల్ ఉపాధ్యాయులకు షాక్ !
- మున్సిపల్, కార్పొరేషన్ స్కూళ్లలో 200 మంది మిగులు

విద్యాశాఖ కొరడా!

- విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాలు నిరాకరణ
- గుంటూరులో 70 ప్రైవేట్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు
- ప్రభుత్వానికి నివేదిక

డయేరియా రహిత సమాజాన్ని సాధిద్దాం

- ప్రచార గోడ ప్రతిని ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి 6

ఒకే గొడుగు కిందకు.. బ్యాంకు గ్యారెంటీలు


- ఏఎంసీలలో కొత్త లైసెన్సులకు సవరణ
- దాదాపు రెట్టింపు చేస్తూ ప్రభుత్వ నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్షకు పెంపు
- పంట ఉత్పత్తులన్నీ ఒకే కేటగిరిలోకి తెచ్చిన మార్కెటింగ్ శాఖ

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఇక నుంచి కొత్త లైసెన్సులు పొందాలంటే బ్యాంక్ గ్యారెంటీలు ఎక్కువ మొత్తంలో నివేదించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న వాటిని రెట్టింపు చేస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ఏఎంసీలకు చేరాయి. గతంలో పండ్లు, కూరగాయలకు కలిపి ఒకే కేటగిరి చార్జీలు ఉండేవి. అలానే ఇతర పంట ఉత్పత్తులకు బ్యాంకు గ్యారెంటీలు ఎక్కువ మొత్తంలో ఉండేవి. ఇప్పుడు కూరగాయలు, పండ్లు ఇతర పంట ఉత్పత్తులు అన్న వ్యత్యాసం లేకుండా అన్నింటినీ ఒకే కేటగిరి కిందకు తీసుకొచ్చి బ్యాంకు గ్యారెంటీలను ప్రభుత్వం సవరించింది. దీని వల్ల రేపటి రోజున లైసెన్సుదారు మోసానికి పాల్పడినా బ్యాంకు గ్యారెంటీని సీజ్ చేసి, రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు సంబంధిత ఏఎంసీలకు వెసులుబాటు కలుగుతుంది.

కొత్తగా బ్యాంకు గ్యారెంటీలు ఇలా..

ఏఎంసీలలో చివరిసారిగా 2000 నవంబరులో బ్యాంకు గ్యారెంటీలను జీవో నంబరు 85 ద్వారా అప్పటి ప్రభుత్వం సవరించింది. వాటిని ఇప్పుడు పునఃసమీక్షించి సవరణలు చేస్తూ జీవో నంబరు 21 అమలులోకి తీసుకొచ్చింది. గతంలో కూరగాయలు, పండ్లకు టర్నోవర్ రూ.కోటి లోపు ఉంటే రూ.50 వేలు, రూ.కోటి నుంచి (మిగతా 6వ పేజీలో)

ఉన్నట్టా.. లేనట్టా!?



- వ్యవసాయ శాఖలో బదిలీల గందరగోళం
- జీఓ విడుదలై వారం దాటినా రిలీవ్ చేయని వైనం
- తలలు పట్టుకుంటున్న డీడీఏ, ఏడీఏలు
- ఒకరిద్దరి కోసం అందరితో ఆటలు

జోన్ -3లో పెద్దగా ఇబ్బందులు లేకున్నా..

గుంటూరు సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో బదిలీల వ్యవహారం గందర గోళంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు అధికారులను బదిలీ చేస్తున్నట్లు గత వారం ప్రభుత్వం జీవో విడుదల చేసినా దాన్ని అమలు పరచక పోవడం చర్చనీయాంశంగా మారింది. అసలు ఎందుకు రిలీవ్ చేయడం లేదో అర్థం కాక చాలా మంది అధికారులు టెన్షన్‌తో తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలో బదిలీల కోసమని ప్రభుత్వం విధించిన గడువు కూడా ముగిసింది. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య బదిలీల సందర్భంలో మొదలైన గిల్లికజ్జాలకు మాత్రం ఫులుస్టాప్ పడకపోవడం అధికారుల పాలిట శాపంగా మారినట్లు చెబుతున్నారు.



బదిలీ జీవోను పక్కన పెట్టించడానికి ప్రధాన కారణం జోన్ -1, 2లో జరిగిన పొరపాట్లు అని తెలుస్తోంది. అయితే జోన్-3 కిందకు వచ్చే ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అటువంటివి జరగలేదన్నది అధికారుల వాదన. ఒకరిద్దరి కోసం అందరినీ ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 30 మంది

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 30 మంది వ్యవసాయ అధికారుల బదిలీ వ్యవహారం ఎటూ తేలకుండా ఉంది. వారిలో పలువురు డీడీఏలు, ఏడీఏలు ఉన్నారు. బదిలీ జీఓ విడుదలైన ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత (మిగతా 6వ పేజీలో)

విజయవాడ వెస్ట్ బైపాస్ ఇంకెప్పుడు

- పూర్తి కాని టోల్ గేటు నిర్మాణం



- జూన్ నుంచి అందుబాటులోకని తొలుత అంచనా
- ఈ రోజు వరకూ పూర్తి కాని నిర్మాణం
- మరో మూడు నెలలు వేచి చూడాల్సిన పరిస్థితి
- చినకాకాని, కృష్ణాయపాలెం, మందడం, గొల్లపూడి వద్ద పెండింగు పనులు

గుంటూరు, జూన్ 15 (ఆంధ్ర జ్యోతి): రాజధాని అమరావతి కనెక్టివిటీలో కీలకమైన విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యేలా కన్పించడం లేదు. ఈ ఏడాది జూన్ నుంచి ఈ బైపాస్ అందుబాటులోకి వస్తుందని విస్తృ తంగా ప్రచారం జరిగింది. అయితే తాజా పరిస్థితులను బట్టి మరో మూడు నెలల వరకూ అందు బాటులోకి వచ్చే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.

విజయవాడ ట్రాఫిక్ నియంత్రణలో కీలకం

ప్రస్తుత ఎన్టీఆర్, ఏలూరు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలను రాజధానితో అనుసంధానించడంలో విజయవాడ వెస్ట్ బైపాస్ అత్యంత ప్రధానమైంది. ఈ బైపాస్ ప్యాకేజీ 4ను ఎన్టీఆర్ జిల్లా చిన్న అవుటుపల్లి నుంచి మంగళగిరి మండలం చినకాకాని వరకు విజయవాడకు పశ్చిమంగా నిర్మిస్తున్నారు. రాజధానిలోని వెంకటపాలెం, మందడం, కృష్ణాయపాలెం, కురగల్లు మీదగా వెళ్తుంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ఆ నాలుగు జిల్లాల వారికి రాజధానితో కనెక్టివిటీ (మిగతా 6వ పేజీలో)

బర్లీ కొనుగోళ్ల భారం రాష్ట్ర ప్రభుత్వానిదే..!

- పొగాకు బోర్డు కార్పస్ ఫండ్ ఇచ్చేందుకు కేంద్ర మంత్రి గోయల్ ససేమిరా
- ఆ నిధి అన్ని రాష్ట్రాలకు సంబంధించినదని వ్యాఖ్య
- మిన్నకుండిపోయిన రాష్ట్ర, జిల్లా ప్రజాప్రతినిధులు



సమీక్షలో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, మంత్రి టీజీ భరత్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హై డెన్సిటీ బర్లీ పొగాకు కొనుగోళ్ల భారం రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ గుంటూరు నగరంలో పొగాకు బోర్డు సందర్శన సందర్భంగా బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు కేంద్రం సాయాన్ని ప్రకటిస్తారని అంతా ఆశించారు. అయితే ఆయన బర్లీ పొగాకు ప్రస్తావన జోలికి పోలేదు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పాల్గొన్న ఈ సమీక్షలో ఒకరిద్దరు బర్లీ పొగాకు అంశాన్ని ప్రస్తావించారు. పొగాకు బోర్డు వేలం కేంద్రాల్లో పొగాకు అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ఒక శాతం ఫీజుని వసూలు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ వద్ద రూ.వందల కోట్ల నిధులు కార్పస్ ఫండ్ రూపంలో ఉన్నాయి. వాటి నుంచి కొంత మొత్తంలో నిధులను బర్లీ పొగాకు కొనుగోళ్లకు కేటాయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశంలో లేవనెత్తగా.. అందుకు కేంద్ర మంత్రి గోయల్ సున్నితంగా తిరస్కరించారు. పొగాకు బోర్డు కార్పస్ ఫండ్ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. దీంతో ఇక రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా మార్కెట్ కమిటీల్లో బర్లీ పొగాకు కొనుగోళ్లను చేపట్టాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. రైతుల నుంచి 20 మిలియన్ కేజీల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలంటే కనీసం రూ.300 కోట్లు అవసరమవుతాయి. అందులో సగం రూ.150 కోట్లు బోర్డు నుంచి కేటాయించమని కోరినా మంత్రి నుంచి సానుకూల స్పందన రాలేదు.

ఎన్ఐడీ, ఇండస్ట్రియల్ పార్కులపై సమీక్ష..

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ) గురించి మంత్రి గోయల్ సమీక్ష చేశారు. అమరావతి రాజధానిలో సగల హంగులతో ఎన్ఐడీ భవనాల నిర్మాణం చాలా వరకు పూర్తయింది. విద్యార్థులకు తరగతులు కూడా నిర్వహిస్తున్నామని అధికారులు నివేదించడంతో.. మంత్రి గోయల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ఐడీలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పైనా మంత్రి గోయల్ సమీక్షించారు. రాష్ట్రంలో నిర్మాణం జరుగుతున్న కృష్ణపట్నం పార్కు గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. దీని తర్వాత మరో మూడు ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉన్నతా ధికారి ఎన్.యువరాజ్, టుబాకో బోర్డు ఈడీ విశ్వశ్రీ, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ, డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు, మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు, డీడీ దివాకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

గుంటూరు(విద్య),జూన్ 15(ఆంధ్ర జ్యోతి): అత్యుత్తమ విద్యను అందించి, అభివృద్ధికి సోపానంగా నిలిచిన పాఠశాలల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పడాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. ఆదివారం గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వర దేవస్థాన కల్యాణ మండపంలో జరిగిన పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థులైన ప్రజా ప్రతినిధుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పూర్వ విద్యార్థి మోదుగుల వాసుదేవరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగానే కాకుండా, పూర్వ విద్యార్థిగా తనకు విద్యను నేర్పిన సీతారామయ్య హైస్కూల్ అభివృద్ధికి తుది శ్వాస వరకు కృషి చేస్తానన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వర కు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సీతారామయ్య హైస్కూల్ విద్యా రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. గుంటూరు నగర మేయర్ కోవెలమూడి నాని మాట్లాడుతూ.. తన ఉన్నతికి, సమాజంలో గౌరవప్రదమైన స్థానానికి సీతారామయ్య హైస్కూలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ల వెంకటేష్ యాదవ్, ఎ.సి.పి గుంటుపల్లి శ్రీనివాస్, ప్రొఫెసర్ ద్వారక సుశీల తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, వసంత కృష్ణప్రసాద్, మేయర్ రవీంద్రను పూర్వవిద్యార్థి సంఘ నాయకులు గోగినేని విజయ్‌కుమార్, మోదుగు ల వాసుదేవ రెడ్డి, జవహర్ ఆధ్వర్యంలో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మున్సిపల్ ఈఈ నాగమల్లేశ్వరరావు, ఆర్‌వీ ఆర్ మాజీ ప్రిన్సిపల్ కోట శ్రీనివాస్, డాక్టర్ యశోద, శాంతిశ్రీ, అనంత శేఖర్, గట్టినేని వెంకటేశ్వరరావు, మండలి శ్రీనివాస్, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పె ద్ది శ్రీనివాస్, దివాకర్, కొమ్మినేని కోటేశ్వర రావు, బంగారు బాబు పాల్గొన్నారు.

ఉన్నట్టా.. లేనట్టా!?

(5వ పేజీ తరువాయి)

సదరు అధికారులు పనిచేసే చోట నుంచి ఉన్న ఫలంగా రిలీవ్ అయ్యేందుకు సిద్ధపడ్డారు. అంతలోనే ఎవరినీ రిలీవ్ చేయవద్దని డీఏఏలకు కమిషనర్ కార్యాలయం నుంచి సందేశం వచ్చింది. 10వ తేదీ నుంచి సవరించిన జాబితా వస్తుంది రిలీవ్ కావచ్చు అని బదిలీ అయిన అధికారులు ఎదురు చూస్తూనే ఉన్నారు. రోజులు గడుస్తున్నా సవరించిన జాబితా విడుదల కాకపోవడం అధికారుల్లో అసహనానికి కారణం అవుతుంది.

మార్పులు జరుగుతాయని..

ఈ నెల 9న విడుదలైన మండల వ్యవసాయ అధికారుల బదిలీ ఉత్తర్వుల ను తర్వాత సవరించారు. డీడీఏ, ఏడీఏల జాబితానూ సవరిస్తారేమోననే అను మానం చాలామందిలో ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆరంభమైంది. బదిలీ సంగతి ఏమయ్యిందో తేలకుండా పిల్లల విషయంలో నిర్ణయం తీసుకోవడం కష్టతరమని కొందరు అధికారులు ఆవేదన చెందుతున్నారు.

4,500 మందికి స్థానచలనం

ముగిసిన ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

గుంటూరు(విద్య),జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్వల్ప ఆందోళనలు, ఉద్రిక్తతల నడుమ ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఆదివారం ఉదయంతో ముగిసింది. జిల్లా పరిష త్, ప్రభుత్వ, మండల పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ యాజమా న్యాల ఆధ్వర్యంలో దాదాపు 4,500 మందికి స్థాన చలనం కలిగింది. సోమవారం నుంచి కొత్త పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గత నెల 27 నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత స్కూల్ అసిస్టెంట్స్‌కు, ఎస్జీటీలకు ఉద్యోగోన్నతుల తర్వాత బదిలీల ప్రక్రియ ప్రారంభించారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు షాక్

ఉపాధ్యాయుల బదిలీల్లో మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే అనేక మంది ఉపాధ్యాయులకు షాక్ తగిలింది. ఈ బదిలీ ప్రక్రియ మున్సిపల్ పట్టణాల మధ్య పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రమే నిర్వహించారు. దీంతో అనేక మంది కౌన్సెలింగ్ కేంద్రంలోనే కన్నీటి పర్యంతమయ్యారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కొంతమంది మంగళగిరి కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. వాస్తంగా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్స్‌లో దాదాపు 25 సంవత్సరాల నుంచి బదిలీ ప్రక్రియ సక్రంగా జరగడం లేదు. దీంతో ఒకే చోట ఉపాధ్యా యులు సంత్సరాల తరబడి పనిచేస్తున్నారు. కొంతమంది సొంత ఇళ్లు నిర్మించుకుని, పిల్లల్ని అక్కడే చదివించుకుంటూ ఉన్నారు. ఇటువంటి వారు సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి అయిష్టంగానే సుముఖత వ్యక్తం చేశారు. మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో దాదాపు 200 మంది వరకు అదనపు ఉపాధ్యాయులు ఉన్నట్లు తేలింది. వీరికి క్లస్టర్ పాఠశాలల కింద పనిచేయాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసింది. అంటే ఒక్కో క్లస్టర్ పరిధిలో ఉన్న 15 పాఠశాలల్లో ఎవరైనా సెలవు పెడితే మిగులు ఉపాధ్యాయులను అక్కడికి పంపేలా ఏర్పాట్లు చేశారు. పదవీ విరమణ వల్ల ఏర్పడే ఖాళీల ప్రకారం వీరిని పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు సజా వుగా జరగడం, ప్రభుత్వం కొన్ని అనుకూల నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.


కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

వెబ్ కౌన్సెలింగ్‌పై వెల్లువెత్తిన నిరసనలు

ఎస్జీటీల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ప్రకారం నిర్వహించాలని తొలు త ప్రభుత్వం భావించింది. అయితే ఉపాధ్యాయులు దీనివల్ల ఒక్కో ఉపాధ్యాయుడు 3 వేల ఆప్షన్లు ఎంచుకోవాల్సి వస్తుందని ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. దీంతో ప్రభుత్వం వెంటనే మ్యాన్యువల్ కౌన్సింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 10న మధ్యాహ్నం నుంచి ఎస్జీటీలకు మ్యాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ ప్రారంభించాలని నిర్ణయించారు. సాంకేతిక సమస్యల వల్ల మరసటి రోజుకు వాయిదా వేశారు. అనంతరం కౌన్సెలింగ్ ప్రక్రియ సజా వుగా ప్రారంభమైంది. సాంకేతిక కారణాలతో మళ్లీ అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు ప్రక్రియ ముగించారు. దాదాపు 15 రోజుల పాటు వివిధ దశల్లో బదిలీలు, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది.

విద్యాశాఖ కొరడా!

విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాలు నిరాకరణ
గుంటూరులో 70 ప్రైవేట్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు
ప్రభుత్వానికి నివేదిక

గుంటూరు విద్య, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యాహక్కు చట్టం కింద కేటాయించిన సీట్లకు ప్రవేశాలు నిరాకరించిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలపై విద్యాశాఖ కొరడా ఝుళిపించింది. ఇటువంటి స్కూళ్లను గుర్తించి వాటి గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలంటూ యాజమాన్యాలకు షోకాజు నోటీసులు జారీ చేసింది. గుంటూరు జిల్లాలో విద్యాహక్కు చట్టం ద్వారా దాదాపు 1,150 సీట్లు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో వచ్చాయి. ఈ నెల 10వ తేదీలోగా విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే కొన్ని స్కూళ్లు విద్యాహక్కు చట్టం ప్రవేశాలను నిరాకరిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు అందడంతో.. విద్యాశాఖకు సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రభుత్వ ఆదేశాలు బుట్ట దాఖలు

విద్యాహక్కు చట్టం ప్రకారం ఇటీవల కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఒకటో తరగతిలో చేర్పించాలని ప్రైవేటు స్కూళ్లకు వెళ్లగా నిరాకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను అవమానకరంగా మాట్లాడారు.దీంతో వారు గుంటూరు ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆయా స్కూళ్ల యాజమాన్యాలకు రెండు రోజుల క్రితం విద్యాశాఖ నోటీసులు జారీ చేసింది. దీంతో కొన్ని యాజమాన్యాలు విద్యార్థులను చేర్చుకునేందుకు ముందుకు రాగా మరి కొంతమంది వివిధ పత్రాలు లేవని ఇతర సాకులు చూపి ఆర్టీఈ ప్రవేశాలను నిరాకరిస్తున్నారు. ఇటువంటి స్కూళ్ల వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని విద్యాశాఖ నిర్ణయించింది. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తాము కోర్టు ఆర్డర్ తెచ్చుకున్నామని ప్రవేశాలు కల్పించలేమని స్పష్టం చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం నుంచి కౌంటర్ పిటిషన్ దాఖలు చేసినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ద్వారా ఎవరికైతే ప్రభుత్వం సీట్లు కేటాయించిందో వారిని తప్పనిసరిగా స్కూళ్లలో చేర్చుకోవాల్సిందేనని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలకు విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

విజయవాడ వెస్ట్ బైపాస్ ఇంకెప్పుడు?


కృష్ణాయపాలెం వద్ద కొండవీటి వాగుపై నిర్మిస్తున్న వంతెన

(5వ పేజీ తరువాయి)

పెరుగుతుంది. దీంతో పాటు దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న విజయవాడ నగరం కొంత మేర విముక్తి పొందుతుంది. ఇప్పటికీ విజయవాడ వారధి, బెంజ్ సర్కిల్, రమేశ్ హాస్పిటల్ సెంటర్, రామవరప్పాడు రింగ్, నిడమానూరు వద్ద ప్రతి రోజూ గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతోంది. విజయవాడ వెస్ట్ బైపాస్ అందుబాటులోకి వస్తే భారీ వాహనాలు అటువైపు వెళ్లిపోతాయి.

పలుచోట్ల పనులు పెండింగ్

వెస్ట్ బైపాస్ ప్యాకేజీ 4లో అత్యంత కీలకమైన కృష్ణానదిపై వంతెన నిర్మాణం ఎప్పుడో పూర్తైపోయింది. ఈ ఏడాది మే 2న ప్రధాని మోదీ చేతుల మీదుగా వెలగపూడిలో జరిగిన రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమం సందర్భంగా వంతెనపై రాకపోకలకు అనుమతించారు. కృష్ణానదికి ఉత్తరాన ఉన్న జిల్లాల నుంచి వచ్చే వీఐపీలందరికీ ఆ వంతెనపై నుంచే రూట్ మ్యాప్ ఇచ్చారు. అత్యంత కీలకమైన వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంకా అనేక చోట్ల పనులు పెండింగులో ఉన్నాయి. మంగళగిరి మండలం చినకాకాని వద్ద ఎన్‌హెచ్‌తో అనుసంధాన ప్రక్రియ ఇప్పటికీ కొలిక్కి రాలేదు. అమృత యూనివర్సిటీ సమీపంలో ఎన్-6, ఈ-11 రోడ్ల జంక్షన్లో కొండవీటి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం కూడా ఇంకా పూర్తికాలేదు. మందడం వద్ద ఈ-8 రోడ్డుపై నిర్మించిన ఫ్లైఓవర్ పనులు, టోల్ గేట్ పనులు ఇంకా చాలా వరకూ పెండింగులోనే ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో గొల్లపూడి, నున్న వద్ద పనులు జరుగుతున్నాయి. అక్కడ రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం ప్రాథమిక దశలో ఉంది. దీంతో వెస్ట్ బైపాస్ అందుబాటులోకి రావడానికి మరింత సమయం పట్టే పరిస్థితి కనిపిస్తోంది.

ఒకే గొడుగు కిందకు.. బ్యాంకు గ్యారెంటీలు

(5వ పేజీ తరువాయి)

రూ. 5 కోట్ల మధ్యన ఉంటే రూ.లక్ష, రూ.5 కోట్ల కంటే అదనంగా ఉంటే రూ. 2.50 లక్షల బ్యాంకు గ్యారెంటీని ముందుగానే సమర్పిం చాలి. ఇతర ఉత్పత్తులకు అయితే వరుసగా రూ. లక్ష, రూ.2 లక్షల, రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.50 వే లు చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు అన్ని నోటిఫైడ్ వ్యవసాయ ఉత్ప త్తులను ఒక గొడుగు కిందకు చేర్చి టర్నోవర్ రూ. కోటి లోపు ఉంటే రూ.2 లక్షలు, రూ. కోటి నుంచి రూ.5 కోట్ల మధ్యన ఉంటే రూ.4 లక్ష లు, రూ.5 కోట్ల టర్నోవర్ దాటితే రూ.7 లక్షలు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలకు ఎంత టర్నోవర్ ఉన్నా రూ.లక్షగా బ్యాంకు గ్యారెంటీని నిర్ణయించారు. ఈ సవరణలు కేవలం కొత్తగా జారీ చేయ బోయే కమీషన్ ఏజెంట్ లైసెన్సులకు మాత్రమే వర్తింపు చేస్తారు.

మిర్చి యార్డులో కొత్త లైసెన్సుల జారీకి సన్నాహాలు

మిర్చి యార్డులో అతి త్వరలోనే కొత్త కమీషన్ ఏజెంట్ లైసెన్సులు మంజూరు చేయాలని మార్కెటింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలు కొంత మంది పేర్లను మార్కెటింగ్ అధికారులకు నివేదించి వాళ్లకు లైసెన్సులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే దీనిపై మార్కెటింగ్ మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అనుమతి రావాల్సి ఉంది. కాగా మిర్చి యార్డులో లైసెన్సు ఉంటే దానిని లీజుకు తీసుకొని ఏటా రూ.3 లక్షలకు పైగా నగదుని బడా వ్యాపారులు చెల్లిస్తుంటారు. దీంతో కొత్త లైసెన్సు పొందేందుకు రూ. 20 లక్షల వరకు చెల్లించడానికి కూడా వెనుకాడరు.

చినుకు రాలదాయె!

(5వ పేజీ తరువాయి)

శాఖ వెల్లడించింది. 54.5 శాతం లోటు నమోదైంది. రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, క్రోసూరు, పెదకూర పాడు, సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు, బొల్లాపల్లి, నూజెండ్ల, శావల్యాపురం, ముప్పాళ్ల, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం నమోదైంది. దుర్గి, కారంపూడి, అచ్చంపేట, అమరావతి, ఈపూరు, రొంపిచర్ల, నరసరావుపేట, చిలకలూరిపేట మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది.

బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలో 35.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 30.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 14.5 శాతం లోటు ఉంది. 25 మండలాలకు గాను 7 మండలాల్లో అత్యధిక లోటు, 6 మండలాల్లో లోటు, ఆరు మండలాల్లో సాధారణ, ఐదు మండల్లాలో అధిక, ఒక మండటంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. చుండూరు, సంతమాగులూరు, మార్టూరు, యద్దనపూడి, అద్దంకి, కొరి శపాడు, చినగంజాం మండలాల్లో అత్యధిక లోటు, అమృతలూరు, బట్టిప్రోలు, చెరుకుంపల్లె, బల్లికురవ, పర్చూరు, చీరాల మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

గుంటూరు జిల్లాలో..

గుంటూరు జిల్లాలో 22.7 శాతం లోటు వర్షపాతం ఉంది. ఇప్పటి వరకు 48.4 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 37.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 18 మండలాల్లోని 6 మండ లాల్లో అత్యధిక లోటు, మరో ఆరు మండలాల్లో లోటు, మూడు మం డలాల్లో సాధారణ, ఒక మండలంలో అధిక, రెండు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మంగళగిరి, తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు ఈస్ట్ మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం ఉంది. తుళ్లూరు, తాడేపల్లి, గుంటూరు వెస్ట్, తెనాలి, చేబ్రోలు, వట్టిచెరుకూరు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

బీసీ సంక్షేమానికి శంకరరావు కృషి: కేంద్ర మంత్రి పెమ్మసాని


బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును సన్మానిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రులు మనోహర్, సత్యకుమార్, పార్థసారథి, బీసీ నేతలు

తెనాలి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా బీసీల సంక్షేమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఎంతగానో కృషి చేస్తున్నారని, బీసీల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం కేసన శంకరరావు దంపతులను బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ అతిపెద్ద బీసీ నాయకుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. గత ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా కూటమి గెలుపు కోసం కేసన పని చేశారని గుర్తుచేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ స్వార్థం లేకుండా బీసీల అభివృద్ధికి శంకరరావు పని చేశారన్నారు. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బీసీల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే కృషి చేస్తే రాష్ట్రంలో శంకరరావు పని చేశారని అభినందించారు. గృహనిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి రాజీపడకుండా శంకర రావు పోరాడుతారన్నారు. సన్మాన గ్రహీత శంకరరావు మాట్లాడుతూ పేదల ప్రజల కోసమే తన జీవితం అంకితం చేశానని, పదవులకు ఆశపడకుండా పని చేస్తున్నానన్నారు. జొన్నాదుల నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో శంకర రావు జీవిత విశేషాలతో రూపొందించిన 'జయహో బీసీ బంధు కేసన శంకర రావు' సంచికను ఆవిష్కరించారు. కన్నా మాస్టారు, అన్నవరపు నాగమల్లేశ్వర రావు, శ్రీనివాస్ గౌడ్, హకీంజాని, ఓంకార్ ప్రసాద్, గంటయ్య, గౌరీశంకర్, గాదె వెంకటేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డయేరియా రహిత సమాజాన్ని సాధిద్దాం

● ప్రచార గోడప్రతిని ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్


వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి తదితరులు

తెనాలి, మారీసుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డయేరియా రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తున్నామన్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తెనాలిలో ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలసి మంత్రి డయేరియా నివారణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో ప్రమాదకరమైన వ్యాధి డయేరియాపై విస్తృత ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ నెల 16 నుంచి జూలై 31 వరకు ఇంప్లిమెంటేషన్ ఫేజ్ 2లో భాగంగా డయేరియా నివారణ కార్యక్రమాలను నిర్వహించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించామని మంత్రి చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల సంస్థల చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి, వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్లూరి శ్రావణ్‌బాబు, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి వేముల ప్రియాంక, ఆరోగ్య విస్తరణాధికారి బాలచంద్ర మౌళి, 104 జిల్లా మేనేజర్ రాఘవకుమార్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజలు, ప్రభుత్వానికి మధ్య నాయకులు వారధిగా నిలవాలని, గుంటూరు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఆయన టీడీపీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కూటమి ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకం గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఎంతమంది ఉన్నా కేవలం ఒక్కరికి మాత్ర మే అమ్మఒడి పథకం అమలు చేసేవారని, సీఎం చంద్రబాబునాయు డు ఆధ్వర్యంలో ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా ఈ పథకాన్ని వర్తింప చేశారని తెలిపారు. దీని ద్వారా ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబంలో రూ.39 వేల నగదు జమయ్యాయని, పిల్లల చదువులకి తల్లిదండ్రులకు ఎలాంటి ఢోకా లేకుండా పోయిందని తెలిపారు. పది నెలల కాలంలో రాష్ట్రంలో పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, అమరావతి రాజధాని నిర్మాణం వంటి అనేక కార్యక్రమా లు అమలు చేశామని, వీటన్నింటి గురించి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులకు తాను అండగా ఉంటానని, ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. కష్టపడి పని చేసే వారికే పార్టీ లో గుర్తింపు ఉంటుందని, ఈ విషయాన్ని అధిష్టానం మాటగా చెబుతున్నానని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం వివరించారు



పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే నసీర్

యోగా జీవితంలో భాగం కావాలి

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. గుంటూరులో ఓంకార్ యోగా ఫౌండేషన్ నిర్వహించిన పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డీసీసీబీ చైర్మన్ మక్కెన, వేదికపై సీఈవో కృష్ణవేణి, రవికుమార్, రాధాకృష్ణమూర్తి తదితరులు

సమష్టిగా సెంట్రల్ బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయాలి

● డీసీసీబీ చైర్మన్ మక్కెన

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సమష్టిగా కోఆపరేటివ్ సెం ట్రల్ బ్యాంకు పురోభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కోరారు. బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మహాజన సభలో ఆయన ప్రసంగించారు. బ్యాంకు అభివృద్ధిలో ఉద్యోగులదే కీలకపాత్ర అన్నారు. రైతులకు సేవలందించటంలో ఉద్యోగులు పార దర్శకంగా వ్యవహరించాలన్నారు. ఉద్యోగులకు ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకు తాను సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో సీఈవో కృష్ణవేణి, ఆల్ ఇండియా కో ఆపరేటివ్ బ్యాంకు ఎం ప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్, ఏపీ కో ఆపరేటివ్ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ వెలుగూరి రాధా కృష్ణమూర్తి, జిల్లా నాయకులు తదితరులున్నారు.



ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ 75వ మహాజన సభను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న చైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్

రూ.1,014 కోట్ల టర్నోవర్‌కు చేరిన అర్బన్ బ్యాంకు

● మహాజన సభలో చైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు కో - ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ దినదినం అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నదని బ్యాంకు చైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్ అన్నారు. ఆదివారం బ్యాంకు 75వ మహాజనసభ అమరావతి రోడ్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. బ్యాంకు వైస్‌చైర్మన్, డైరెక్టర్లు, అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి జాగర్లమూడి చంద్రమౌళీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బోనబోయిన మా ట్లాడుతూ బ్యాంకు నూతన బ్రాంచ్‌లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బ్యాంకుకు తగిన సలహాల ను ఇస్తూ తోడ్పడుతున్న సహకార శాఖ అధికారులు, రిజర్వు బ్యాంకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. 2024-2025వ ఆర్థిక సంవత్సరానికి డివిడెంట్‌ను మహాజనసభ సభ్యుల ఆమోదంతో ప్రకటించా రు. ఈ సమావేశంలో బ్యాంకు వైస్‌చైర్మన్ ఎం బసివిరెడ్డి, సీఈవో ఎన్ సంజీవరావు, పాలకమండలి సభ్యులు, బ్రాంచ్‌ల మేనేజర్లు, షేర్ హోల్డర్లు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

25న వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి

● కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జ్ ప్రకాష్

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాల పర్యటనలో భాగంగా ఈనెల 25న జిల్లా కేంద్రం గుంటూరులో రాజీవ్‌గాంధీభవన్‌లో సమావేశానికి రానున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జ్ శ్రీపతి ప్రకాష్ పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీభవన్‌లో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఏపీసీసీ క్రమ శిక్షణ కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, సభ్యుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలిని సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ రాచకొండ జాన్‌బాబు, గడ్డం పాల్‌విజయ్‌కుమార్, బి.సునీల్, షేక్ కరిముల్లా, జవహర్‌బాబు, బ్రహ్మం తదితరులున్నారు.

సకాలంలో అందిస్తే బ్రెయిన్ స్ట్రోక్ నుంచి ఉపశమనం

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సకాలంలో అందించే వైద్యంతోనే బ్రెయిన్ స్ట్రోక్ నుంచి ఉపశమనం పొందవచ్చని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, ప్రముఖ కన్సల్టెంట్ న్యూరో రేడియాలజిస్ట్ అండ్ ఇంటర్వెన్షనల్ వైద్యుడు లంకా వివేక్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. సడన్‌గా చూపు తగ్గినా.. కాళ్లు, చేతులు పడిపోయినా.. గొంతు మారినా బ్రెయిన్ స్ట్రోక్‌గా గుర్తించాలన్నారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ ఆకుకూరలు తింటూ, మనసును ఆందోళనలకు గురి కాకుండా ఉంటే బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కాకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరాం, జేకేసీ కాలేజ్ విశ్రాంత అధ్యాపకులు ఆర్ రామచంద్రరావు, డాక్టర్ రవికుమార్, జనవిజ్ఞాన వేదిక చలమారెడ్డిలు ప్రసంగించారు.

టీజేపీఎస్‌లో ముగిసిన వేసవి క్రీడా శిబిరం

గుంటూరు(విద్య), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాలలో నెలరోజుల పాటు జరిగిన వేసవి క్రీడా శిక్షణ ఆదివారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి కార్యదర్శి కేవీ బ్రహ్మం ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యదర్శి కేవీ బ్రహ్మం మాట్లాడుతూ క్రీడలు వంటి వాటిల్లో పాల్గొనడం వల్ల నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని అన్నారు. కార్యక్రమంలో ఈ సమ్మర్ క్రీడా శిక్షణ కో ఆర్డినేటర్, కళాశాల వ్యాయా మ అధ్యాపకుడు ఆర్ శివాజీ, కో కన్వీనర్ జేవీ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు కరువు భత్యం పెరుగుదల విధి విధానాలు

● ఈదర వీరయ్య

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటే పెన్షనర్లకు కరువుభత్యం (డీఏ) పెరుగుదల విధి విధానాల గురించి రాష్ట్ర పెన్షన్ దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆదివారం ఒక ప్రకటనలో వివరించారు. నెలవారీ వేతనాలపై ఆధార పడే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల కొనుగోలు శక్తి ధరల పెరుగుదల కారణంగా నానాటికి క్షీణిస్తుందన్నారు. రూపాయి విలువ దిగ జారుతున్న నేపథ్యంలో నిజ వేతనాలు తగ్గుతున్నాయని, దీంతో వేతన జీవుల, పెన్షనర్ల ఆర్థిక పరిస్థితి క్రమంగా దిగజారుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లను ఆదుకోవటానికి కేంద్ర ప్రభుత్వం ఆరు నెలలకొకసారి కరువు భత్యం ప్రకటిస్తుందన్నారు. కేంద్రం ప్రకటించిన డీఏ శాతాన్ని పరిగణలోనికి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు డీఏ మంజూరు చేస్తుంది. ఎంత శాతం డీఏ ఇవ్వాలనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏ ప్రాతిపాదికన నిర్ధారిస్తుందనే విషయం తెలుసుకోవాలని పెన్షనర్లకు ఉంటుందని వివరించారు. 3 రకాల ధరల సూచికలు అఖిల భారత కన్‌జ్యూమర్స్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా వినియోగదారుల ధరల సూచికలు మూడు రకాలుగా ఉంటాయన్నారు. మొదటిది పారిశ్రామిక వర్కర్ల వినియోగదార్ల ధరల సూచిక కాగా, రెండోది వ్యవసాయ రంగం కూలీల ధరల సూచిక, మూడోది గ్రామీణ కూలీల ధరల సూచిక. అఖిల భారత పారిశ్రామిక వర్కర్ల వినియోగదారుల ధరల సూచిక ప్రాతిపదికగా మాత్రమే కేంద్ర ప్రభుత్వం 6 నెలలకొకసారి డీఏ శాతాన్ని నిర్ధారించి ప్రకటిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా 78 మహానగరాల నుంచి వినియోగదారులు 24రకాల వస్తువులకు చెల్లించే ధరలను సేకరిస్తా రు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఒక శాతం డీఏకు రాష్ట్ర ప్రభుత్వం 0.856 శాతం డీఏ చెల్లిస్తుందన్నారు. డీఏ మంజూరులో రాష్ట్ర ప్రభు త్వం ఒక్కోసారి జాప్యం చేస్తుందని, కేంద్రం తరహాలో ప్రతి మార్చి, సెప్టెంబర్ నెలలో డీఏ వాయిదాలు చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయాన్ని సత్వరమే ప్రకటించాలని వీరయ్య కోరారు.

19న ఆర్టీసీ డిపోలలో ధర్నాలు

గుంటూరు(తూర్పు), జూన్ 15(ఆంధ్రజ్యోతి): పది గంటల పని విధానం, మహిళలకు రాత్రి సమయంలో విధులు వంటి విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 19న ఆర్టీసీ డిపోలు, గేట్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర కమిటీ ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విధానాలను ఉపసంహరించే వరకు దశలవారి ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కండక్టర్ల ఉద్యోగ భద్రతకు సంబంధించి 2019 ఏడాది సర్క్యులర్‌ను యథాతథంగా అమలు చేయాలని, జీవో నెంబర్ 70లోని కార్మిక వ్యతిరేక అంశాలను రద్దు చేయాలని ఈనెల 27న విజయవాడలో రాష్ట్ర సదస్సు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభలు అక్టోబరు 9, 10 తేదీల్లో తిరుపతిలో జరుపు తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సుందరయ్య, ఆర్ లక్ష్మయ్య, అయ్యప్ప రెడ్డి, పట్టాభిరామ్ దొర తదితరులు పాల్గొన్నారు.



కూటమి నాయకుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటరు పద్మావతి, నాయకులు

తల్లికి వందనంతో కూటమి సరికొత్త చరిత్ర

గుంటూరు(తూర్పు), జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనంతో కూటమి ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించిందని టీడీపీ సీనియర్ నాయకులు ఘంటసాల సోమశేఖర్, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి అన్నారు. స్థానిక గోరంట్లలో పంచాయతీ కార్యాలయం వద్ద 47వ డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో కూటమి నాయకుల చిత్రపటాలకు పాలాభిషే కం చేశారు. వారు మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్న చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యర్రంశెట్టి వేణు గోపాల్, దాది గోపాల్ యాదవ్, విజయ్, యర్రంశెట్టి రాజేష్, ఉదయ్, కామినేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ మత్తులో మోదీ ప్రభుత్వం : సీఐటీయూ

గుంటూరు(తూర్పు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి ప్రైవేటీకరణ పిచ్చి పట్టిందని, అందుకు ఏపీ ముఖ్యమంత్రి వంతపాడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు విమర్శించారు. గుంటూరు, సీపీఎం కార్యాలయంలో జరుగుతున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభల్లో ఆయన ప్రసంగించారు. దేశంలో విద్యుత్ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ప్రైవేటీకరణ అన్నారు. రూ.80 లక్షల కోట్ల విలువైన విద్యుత్ రంగం ఆస్తులను అంబానీ, అదానికి అప్పగించటానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. విమానయానం ప్రైవేటీకరణతోనే విమాన ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రైవేటీకరణ, కార్మి కచట్టాల నిర్వీర్యం వంటి విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ జాతీయ కోశాధికారి ఎస్.రాజేంద్రన్ మాట్లాడుతూ జేఎల్‌ఎం గ్రేడ్-2లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ జూన్ 22న నెల్లూరులో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభల్లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సూరిబాబు, పి.సుదర్శన్‌రెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎల్ రాజు, ఉపాధ్యక్షులుగా నాగబ్రహ్మాచారి, వి.సత్యనారాయణ, శివప్రసాద్, పి.ప్రసాద్, ఆర్ సత్యారావు, జాయింట్ సెక్రెటరీలుగా జాకీర్ హుస్సేన్, డి.వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసరావుతోపాటు 39 సభ్యులను ఎన్నుకున్నారు.

'తల్లికి వందనం' పూర్తిగా ఇవ్వకపోవడం శోచనీయం : ఎస్‌ఎఫ్‌ఐ

గుంటూరు(విద్య), జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ లో భాగంగా తల్లికి వందనం పథకం పూర్తి స్థాయిలో అమలు చేయక పోవడం శోచనీయమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ అన్నారు. కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల సమయంలో కుటుంబంలో ఒకటి నుంచి 12 వరకు తరగతి చదువుతున్న ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిం దన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత తల్లుల అకౌంట్ లోకి రూ.13 వేలు జమ చేసి రూ.2 వేలు స్కూలు కాలేజీల అభివృద్ధి పనుల కోసం మినహాయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు కే కవిత, ఎస్‌ఎఫ్‌ఐ నగర ఉపాధ్యక్షుడు షంషీర్ సుభాని, గంగాధర్, సంతోష్, రవి, అర్జున్ విద్యార్థులు పాల్గొన్నారు

22న పూర్వ విప్లవ విద్యార్థి వేదిక సదస్సు



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న పూర్వ విప్లవ విద్యార్థి వేదిక నాయకులు

గుంటూరు(తూర్పు), జూన్ 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు, స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో ఈనెల 22న పూర్వ విప్లవ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో ప్రజా సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు వేదిక నాయకులు నవజ్యోతి, భరద్వాజలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట, గోల్డెన్ పార్క్ హోటల్‌లో జరిగిన కార్యక్రమలో పోస్టర్లను ఆవిష్కరించి మా ట్లాడారు. దేశంలోని విప్లవకారులని చంపేయాలనే కార్పొరేట్ శక్తులు షరతును కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖనిజ సంపదను దోచుకేందుకు ఆదివాసులపై కేంద్రం చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని కోరారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పౌర సమాజం బలంగా కోరుకుంటుందని, అందుకు భిన్నంగా కేంద్రం వ్యవహరిస్తుందని అన్నారు. ఆదివాసి, గిరిజన ప్రజల మీద జరుపుతున్న యుద్ధం, మావోయిస్టు పార్టీ నాయకుల హత్యలపై ఈ సదస్సులో చర్చించనున్నట్టు తెలిపారు. సదస్సులో మేధావులు, ప్రజా, విద్యార్థి సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చెన్నకేశవుల పోరాటాలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), జూన్ 15(ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం పేదల పక్షాన కొర్రపాటి చెన్నకేశవులు చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం కొర్రపాటి చెన్నకేశవులు 57వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మహిళా నాయకురాలు చందవోలు శోభా రాణి మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ వద్ద చెన్నకేశవుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొర్రపాటి సురేష్, ఈమని చంద్రశేఖర్, షేక్ ఖాజావలీ, దారా అంబేద్కర్, నాగుల్‌మీరా, క్రాంతికుమార్, శంకర్ ప్రసాదు, నల్లపు నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పింఛన్ల పంపిణీ

గుంటూరు(విద్య), జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని అవోప (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్) కార్యాలయంలో ఆదివారం పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, డాక్టర్ వేమూరి నాగ శంకర్, చార్టెడ్ అకౌంటెంట్ పులికొండ పిచ్చయ్య, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటపర్తి రాంబాబు పాల్గొన్నారు. డాక్టర్ వేమూరి నాగశంకర్ మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెల 108 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.ఐదొందల చొప్పున పింఛను పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అవోప ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, స్వామి గుప్తా, మిరియాల మోహన్‌రావు, అమరా రమేష్, రమణ పాల్గొన్నారు.

జయదీప్‌ను సన్మానించిన మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని నగరంలోని భారతీయ విద్యాభవన్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన రక్తదాన శిబిరంలో కొవిడ్-19 సమయంలో విశేషమైన సేవలు, స్వచ్ఛంద రక్త దాన కార్యక్రమాలు నిర్వహించినందుకు జనసేన పార్టీ నాయకుడు యర్రగోపుల జయదీప్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఘనంగా సన్మానించారు. జయదీప్‌కు మెడల్‌ను, జ్ఞాపికను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లా డుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో పలుమార్లు రక్తదానం చేసిన జయదీప్ ఎన్నో ప్రాణాలు కాపాడారని అభినందించారు. కార్యక్రమం లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైవీ రామారావు, ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, కోశాధికారి రామచంద్రరాజు, జిల్లా చైర్మన్ వడ్ల మాని రవి, ప్రముఖ వైద్యుడు సమరం తదితరులు పాల్గొన్నారు.



జయదీప్‌కు మెడల్‌ను ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్

జూమ్ కౌన్సెలింగ్ నిర్వహణపై హర్షం

గుంటూరు(తూర్పు), జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో జరుగుతున్న సాధారణ బదిలీల్లో పేపరు కౌన్సెలింగ్ స్థానంలో జూమ్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణ యంపై ఏపీఎన్‌జీజీవో సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ విధానంలో ఖాళీలు, కోరుకున్న చోటు, సీనియారిటీ వంటి అంశాలను ప్రకటించిన తరువాతే జూమ్ కౌన్సెలింగ్ చేపడతారని తెలిపారు. ఇటువంటి విధానంతో ఉద్యో గులకు మేలు జరుగుతుందని అన్నారు. ఏపీ ఎన్‌జీజీవో అభ్యర్థనను పరిగణనలోకి తీసు కుని వెంటనే అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎండీ కృష్ణబాబుకు, సమస్యను రాష్ట్ర స్థాయి అధికారులు తీసుకువెళ్లి పరిష్కరించిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్‌కు కృతజ్ఞతలు తెలుపుతు న్నట్టు పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గుంటూరు(తూర్పు), జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా సాధన చేయగలిగితే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కమ్మ జనసేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అన్నారు. స్థానిక కుందుల రోడ్డులో కమ్మ వసతి గృహంలో ఆదివారం టీటీడీ దేవస్థానం, అన్నమా చార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగాతో దీర్ఘకాలిక రోగాలు కూడా నయమవుతాయని చెప్పారు. అనంతరం యోగా చార్యులు కిలారు రాజేష్ ఆధ్వర్యంలో శారీ రక ఆరోగ్యం, మానసిక స్థితిస్థాపకత, యోగా ప్రాథమికాలు, శ్వాస నియం త్రణ, పలు అసనాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శిక్షణ నిత్యం కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమం సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికగా కళాంజలి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షు డు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావులు జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ, గాయకులు బాల కామేశ్వరరావు, సత్యవర్ధన్, షేక్ రసూల్‌బాబు, ఆర్ సాంబశివరావు, పీ గాయత్రి తమ గాత్ర ధారణలో అలనాటి మేటి చిత్రాలలోని పలు మధురగీతాలను శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డ్‌పై కే రవిబాబు, తబలపై విజయ్‌పాల్, పాడ్స్‌పై రవిలు వాయిద్య సహకారం అందించారు.

అమ్మవారికి విశేషాభిషేకాలు

గుంటూరు(తూర్పు), జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లారెడ్డినగర్, శ్రీఅయ్యప్ప స్వా మి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామికి ఆదివారం గోపూజ, గురుప్రార్థన, మండపారాధన నిర్వహించారు. అనంతరం శ్రీ విద్యా సరస్వతి అమ్మవారికి, సుబ్రహ్మణ్య స్వామికి విశేషాభిషేకార్చనలు జరిపి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం శ్రీసూక్త, సుబ్రహ్మణ్య హోమాలను భక్తి శ్రద్ధలతో నిర్వ హించారు. కార్యక్రమాల్ని మెట్టు కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు ఘనస్వాగతం

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా గుంటూరు నగరంలోని పొగాకు బోర్డు కార్యాలయానికి వచ్చిన కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఘన స్వాగతం లభించింది. ఆదివా రం సాయంత్రం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మార్గాని భరత్, పశ్చిమ ఎమ్మె ల్యే గల్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసు బలగాల నుంచి ఆయన గార్డ్ ఆఫ్ ఆనర్‌ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, టీడీపీ నేతలు కనపర్తి శ్రీని వాసరావు, వేములపల్లి శ్రీరాంప్రసాదు, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, కార్పొరేటర్ ఈరంటి బాబు, మ్యానీ, షౌకత్, బీజేపీ నేతలు చెరుకూరి తిరుపతిరావు, వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి మార్గాని భరత్, ఎమ్మెల్యే గల్లా మాధవి, మేయర్ రవీంద్ర, టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరులోనే పంచకర్మ వైద్యసేవలు

● కేరళ ఆయుర్వేద నిపుణుడు కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద పంచక ర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేదని, కేరళ వారి అను బంధంతో అన్ని సదుపాయాలతో వంద పడకల సామర్థ్యంతో గుంటూ రులోనే ఆయుర్వేదిక్ ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చినట్లు శ్రీవెంకటే శ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ చైర్మన్, ప్రముఖ కేరళ ఆయుర్వేద ప్రధా న వైద్యనిపుణుడు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం పెదకాకాని మండలం అగతవరప్పాడులోని జిల్లా పరిషత్ ప్రాథమికో న్నత పాఠశాలలో శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకుడు తల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పురాతనమైనదని, అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఈ వైద్యవిధానంలో చక్కటి పరిష్కారాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం జరిగిన వైద్యశిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు డాక్టర్లు భాను కశ్యప్, భావన, మోనిక, రాహుల్ చంద్ర, రోగుల బీపీ, షుగర్ పరీక్షల తో పాటు నాడీ పరీక్షలు చేశారు. శిబిరంలో 150 మంది రోగులు వైద్య సేవలు పొందగా, వీరికి రూ.లక్ష విలువైన మందులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ టీ చిన్న పోలిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాషా, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరమ్మ, ఆసుపత్రి మేనేజర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

రాజధానిలో పరుగులు పెడుతున్న రియల్ రంగం

● తెనాలి శ్రావణ్‌కుమార్, దేగల ప్రభాకర్

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాజధానిలో రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోతోందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కు మార్, ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. రియల్ ఎస్టేట్ సంస్థ ఎలైట్ ఇన్‌ఫ్రా పేరేచర్లలో చేపట్టిన స్కై సిటీ ప్రాజెక్టు బ్రోచర్‌ను శ్రావణ్‌కుమార్, దేగల ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఇలా అభివృద్ధి జరగడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్‌కు ఢోకా లేదని భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో అమరావతి మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎలైట్ ఇన్‌ఫ్రా ఉన్నంతవరకు పేదవాడి సొంతింటి కలలకు ఢోకా లేదని అన్నారు. ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ అభివృద్ధిలో రాజీ పడకుండా కస్టమర్ల అభిమానాన్ని సంపాదించుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎలైట్ ఇన్‌ఫ్రా ఉంటుందని చెప్పారు. స్థలం తీసుకోవడం, ఇల్లు కట్టుకోవడం సామాన్య, మధ్యతరగతి వారి కలలను నిజం చేసేందుకు స్కై సిటీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఎలైట్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు కొత్తమాసు నందు మాట్లాడుతూ నిబంధ నలకు అనుగుణంగానే వెంచర్‌ని ఏర్పాటు చేశామన్నారు. సీఆర్డీఏ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సకల వెంకటేశ్వరరావు, కే కృష్ణమోహన్, మద్ది రామకృష్ణ, చెన్నుపాటి వెంగళరావు, దాది సాంబశివరావు, మోహన్ కృష్ణ, డాక్టర్ చెరుకూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రావణ్‌కుమార్, దేగల ప్రభాకర్

ప్రతిఒక్కరూ క్రీస్తు మార్గాన్ని అనుసరించాలి

● పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య, పిల్లి ఆంథోని

● ఘనంగా పునీత ఆంథోని వారి మహోత్సవం

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు క్రీస్తు మార్గాన్ని అనుసరించాలని గుంటూరు, నెల్లూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య, పిల్లి ఆంథోని దాస్ అన్నారు. ఈ మేర కు ఆదివారం నగరంపాలెం పరిధిలోని పునీత ఆంథోని వారి దేవాలయ 35వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో 40 అడుగుల మరియతల్లి విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పీఠాధిపతులు భాగ్యయ్య, ఆంథోనిదాసు గాలిబాలి దివ్య పూజబలి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు పుణ్యక్షేత్ర విచారణ గురువు కొచ్చెర్ల జ్యోతిరాజు అధ్యక్షత వహించారు. గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిన భాగ్యయ్య మాట్లాడుతూ అద్భుతాల అంతోని వారి పుణ్యక్షేత్రంలో 35వ వార్షిక వేడుకల్లో పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఐదు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి పునీత అంతోని వారి అద్భుతాలను పొందేందుకు కథోలిక విశ్వాసులు తరలివస్తుంటారన్నారు. ఆంథోని వారి మహిమలు పొందడానికి ప్రతి ఒక్కరూ ఈ ఆలయాన్ని సందర్శించి ప్రార్థించాలన్నారు. కార్యక్రమంలో పునీత అంతోని వారి పుణ్యక్షేత్ర సహాయ గురువు ఎన్ రాజేష్, ఫాదర్స్ దాసరి కిరణ్, పి.బాలస్వామి. రేపూడి రాయప్ప, రాజారెడ్డి, సుందరరావు, బాలస్వామి, కమిటీ సభ్యులు ఎన్‌జీ ప్రకాశరావు, జొన్నలగడ్డ సుదీర్, సుదర్శన్, కథోలిక విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆంథోని వారి మహోత్సవాలకు హాజరైన పీఠాధిపతులు భాగ్యయ్య, పిల్లి ఆంథోని దాస్, గాలి బాలి

దిక్సూచి



ఇండస్ట్రీ డిమాండ్లతోపాటు, కొత్త కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి మన దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలు ముందు ఉంటున్నాయి. అందులో భాగంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఇంటర్ డిసిప్లినరీ, కొత్త ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రారంభించిన కొత్త బ్రాంచ్‌లు ఏమిటో చూద్దాం.

ఇంజనీరింగ్‌లో కొత్త బ్రాంచ్‌లు

ఐఐటీల్లో

1. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అండ్ డేటా సైన్స్

ఏఐ అండ్ డేటా సైన్స్, డేటా సైన్స్ అండ్ ఏఐ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఏఐ ఇలా రకరకాల పేర్లతో లేదా కాంబినేషన్లతో హైదరాబాద్, గౌహతి, ఢిల్లీ, జోద్‌పూర్, పాట్నా ఐఐటీలు ఈ బ్రాంచీలను అందిస్తున్నాయి.

ఉద్యోగ అవకాశాలు: ఏఐఎంఎల్ ఇంజనీర్, డేటా సైంటిస్ట్, బిజినెస్ అనలిస్ట్, ఎన్ఎల్‌పీ ఇంజనీర్, కంప్యూటర్ విజన్ ఇంజనీర్‌గా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీల్లో అవకాశాలు: గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి టెక్ దిగ్గజాలతోపాటు, స్టార్టప్‌లు, ఫైనాన్స్(క్వాంటమ్ రోల్స్), హెల్త్ కేర్(ఏఐ డయాగ్నస్టిక్స్), ఈ కామర్స్ తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో ఐఐటీలు, ఎన్ఐటీల వంటి సంస్థల్లో చదివిన వారికి 12 నుంచి 30 లక్షలు. విదేశాల్లో అయితే 20 నుంచి 50 లక్షల వరకు ఉండొచ్చు.

భవిష్యత్తు: ఆటోమేషన్, రోబోటిక్స్ తదితరాల్లో ఏఐ కీలకంగా మారుతుంది. అలాగే జనరేటివ్ ఏఐ అంటే చాట్ జీపీటీ తరహా మోడల్స్ కారణంగా వీరికి డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది.

2. రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ మెకట్రానిక్స్

అలహాబాద్(ప్రయాగ్‌రాజ్), హైదరాబాద్, జోద్‌పూర్ ఐఐటీలు ఈ బ్రాంచ్‌ను అందిస్తున్నాయి.

అవకాశాలు: రోబోటిక్స్ ఇంజనీర్, ఆటోమేషన్ స్పెషలిస్ట్, కంట్రోల్ సిస్టమ్ ఇంజనీర్, డిఫెన్స్ అండ్ స్పేస్‌లో ఆర్ అండ్ డీలుగా పని చేయవచ్చు.

ఏయే కంపెనీలు: టెస్లా, ఫాక్స్‌కాన్ వంటి మాన్యుఫాక్చరింగ్, ఇస్రో, స్పేస్ ఎక్స్ వంటి అంతరిక్ష సంస్థలు, డీఆర్‌డీఓ వంటి రక్షణ సంస్థలు, సీమెన్స్, బోష్ వంటి ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో 8 నుంచి 20 లక్షలు. యూఎస్, జర్మనీ, జపాన్ వంటి విదేశాల్లోని రోబోటిక్స్ హబ్స్‌లో అయితే 20 నుంచి 60 లక్షలు.

భవిష్యత్తు: ఇండస్ట్రీ 4.0, స్మార్ట్ ఫ్యాక్టరీలు, అటానమస్ వెహికిల్స్ వంటివి వీరికి డిమాండ్‌ను తెస్తాయి.

3. రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ వెహికిల్(ఈవీ) ఇంజనీరింగ్

ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పేరుతో బాంబే ఐఐటీ, ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో ఢిల్లీ ఐఐటీ, సస్టయినబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో మద్రాస్ ఐఐటీ ఈ బ్రాంచ్‌లను అందిస్తున్నాయి.

అవకాశాలు: ఈవీ డిజైన్ ఇంజనీర్, సోలార్ విండ్ ఎనర్జీ కన్సల్టెంట్స్, బ్యాటరీ టెక్నాలజిస్ట్, సస్టయినబుల్ అనలిస్ట్ తదితర ఉద్యోగాలు ఉంటాయి.

ఏయే కంపెనీలు: టెస్లా, టాటా మోటార్స్, ఓలా ఎలక్ట్రిక్, అదానీ గ్రీన్, సీమెన్స్ గమేసా, ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్టులు తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో 6 నుంచి 18 లక్షలు. విదేశాల్లో ఇంకా చాలా ఎక్కువగా ఉంటుంది.

భవిష్యత్తు: 2030 సంవత్సరం వరకు 500 గిగా వాట్ పునరుత్పాదక ఇంధనాలను తయారు చేయాలని భారత దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఈవీ బూమ్ కూడా వీరికి పెద్ద ఎత్తున అవకాశాలను కల్పించనుంది.

4. మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (నానో టెక్నాలజీ, ఇతర స్మార్ట్ మెటీరియల్స్ కేంద్రంగా)

ఈ బ్రాంచ్‌ను కాన్పూర్, మద్రాస్, బాంబే ఐఐటీలు అందిస్తున్నాయి.

5. క్వాంటమ్ టెక్నాలజీ

క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీఎస్సీ డిగ్రీని మద్రాస్ ఐఐటీ అందిస్తుండగా, క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ఐఐటీ జోద్‌పూర్‌లో బ్రాంచ్ ఉంది.

అవకాశాలు: క్వాంటమ్ ఆల్గోరిథమ్ డెవలపర్, క్వాంటమ్ హార్డ్‌వేర్ ఇంజనీర్, క్రిప్టోగ్రఫీ రీసెర్చర్ వంటి ఉద్యోగాలు చేయవచ్చు.

ఏయే కంపెనీలు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి పరిశోధనశాలలు, ఐబీఎమ్, గూగుల్ క్వాంటమ్ ఏఐ వంటి పెద్ద టెక్ సంస్థలు, క్వాంటన్ ఎన్‌క్రిప్షన్ వంటి రక్షణ సంస్థల్లో పనిచేయవచ్చు.

జీతభత్యాలు: భారతదేశంలో రీసెర్చ్ స్టార్టప్స్‌లో 15 నుంచి 30 లక్షలు. విదేశాల్లో సుమారు లక్షన్నర డాలర్లు.

భవిష్యత్తు: ఈ రంగాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. కంప్యూటింగ్, క్రిప్టోగ్రఫి, మెటీరియల్‌సైన్స్‌లు వేగంగా ఎదిగే అవకాశం ఉంది.

6. బయో ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్

ఈ బ్రాంచ్‌లను ఢిల్లీ, బాంబే, కాన్పూర్, హైదరాబాద్‌ల్లోని ఐఐటీలు అందిస్తున్నాయి.

అవకాశాలు: మెడికల్ డివైజ్ డిజైనర్, బయో మెకానిక్స్ ఇంజనీర్, హెల్త్‌కేర్ ఏఐ స్పెషలిస్ట్

ఏయే కంపెనీలు: బయోకాన్- డాక్టర్ రెడ్డీస్ వంటి ఫార్మా కంపెనీలు, సీమెన్స్ హీల్ థిన్నర్స్ వంటి మెడ్‌టెక్ కంపెనీలు, ఎయిమ్స్, ఐసీఎంఆర్ వంటి పరిశోధన సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 6 నుంచి 15 లక్షలు. విదేశీ మెడికల్ హబ్స్‌లో ఇంకా ఎక్కువగా ఉంటుంది.

భవిష్యత్తు: పెరుగుతున్న జనాభా, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్ ఉత్పత్తుల కారణంగా వీరికి మంచి డిమాండ్ ఉంటుంది.

6. కంప్యూటేషనల్ ఇంజనీరింగ్(ఏఐ + మెకానిక్స్ డిజైన్)

ఈ బ్రాంచ్ హైదరాబాద్, గాంధీనగర్ ఐఐటీల్లో ఉంది.

7. ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఈవీ) అండ్ మొబిలిటీ ఇంజనీరింగ్

మద్రాస్ ఐఐటీలో మొబిలిటీ ఇంజనీరింగ్, ఢిల్లీ ఐఐటీలో ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ ఉంది

8. సైబర్ సెక్యూరిటీ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ

కాన్పూర్ ఐఐటీలో సైబర్ సెక్యూరిటీ, జోద్‌పూర్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్‌లు ఉన్నాయి.

అవకాశాలు: ఎథికల్ హ్యాకర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, థ్రెట్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్, బ్లాక్‌చైన్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ తదితరాలు పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలు, సెర్ట్ ఇన్ వంటి రక్షణ సంస్థలు, పేటీఎమ్-రాజోర్ పే వంటి ఫిన్‌టెక్ కంపెనీలు, పాలో ఆల్టో - క్రౌడ్ స్ట్రైక్ వంటి గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ సంస్థల్లో పనిచేయవచ్చు.

జీతభత్యాలు: భారతదేశంలో 10 నుంచి 25 లక్షలు. విదేశాల్లో సుమారు లక్ష డాలర్లు.

భవిష్యత్తు: భవిష్యత్తు సైబర్ యుద్ధాలు జరిగే కాలం, 5జి క్లౌడ్ సెక్యూరిటీ అవసరాలు వీరి డిమాండ్‌ను బాగా పెంచుతాయి.

9. కాగ్నెటివ్ సైన్స్(హ్యూమన్-కంప్యూటర్ ఇంటరాక్షన్, ఏఐ+ సైకాలజీ)

గాంధీ నగర్, కాన్పూర్ ఐఐటీలో కాగ్నెటివ్ సైన్స్‌లో డ్యూయల్ డిగ్రీ కోర్సు ఉంది.


అవకాశాలు: యూఎక్స్‌యూఐ డిజైనర్, ఏఐ ఎథిస్ట్, న్యూరోసైన్స్ ఇంజనీర్(బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్) తదితరాలుగా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: టెక్ కంపెనీలైన మైక్రోసాఫ్ట్ రీసర్చ్, మెటా, హెల్త్‌కేర్‌లో న్యూరో స్టార్టప్స్‌లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: యూఎక్స్ రోల్స్‌లో అయితే 10 నుంచి 25 లక్షలు. పరిశోధనలవైపు వెళితే ఇంకా ఎక్కువ ఉంటుంది.

భవిష్యత్తు: ఏఐ ఎథిక్స్, మెటావర్స్, ఏఆర్‌వీఆర్‌లో కాగ్నిటీవ్ సైన్స్ నిపుణుల అవసరం ఉంటుంది.

ఇంకొన్ని..



ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), సైబర్ ఫిజికల్ సిస్టమ్స్

అవకాశాలు: ఐఓటీ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్, ఎంబెడెడ్ సిస్టమ్ ఇంజనీర్, స్మార్ట్ సిటీ కన్సల్టెంట్‌గా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: జియో, ఎయిర్‌టెల్ వంటి టెలికామ్ కంపెనీల్లో, ఎల్‌అండ్ టీ, సీమెన్స్ వంటి స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఐవోటీ ఆధారిత ఫార్మింగ్ అగ్రిటెక్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 8 నుంచి 20 లక్షలు. గ్లోబల్ ఐటీ మార్కెట్ డిమాండ్ బాగా ఉంది.

భవిష్యత్తు: 5జీ బాగా పెరుగుతోంది. ఐఓటీ ఆధారంగా స్మార్ట్‌సిటీలు తయారవుతున్నాయి.

మెటీరియల్స్ సైన్స్ (స్మార్ట్ మెటీరియల్స్ నానో టెక్)

అవకాశాలు: నానోటెక్ రీసెర్చర్, కాంపోజిట్ మెటీరియల్స్ ఇంజనీర్, సెమీ కండక్టర్ మెటీరియల్స్ స్పెషలిస్ట్ తదితరాలుగా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: ఇంటెల్, టీఎస్ఎమ్‌సీ వంటి సెమీ కండక్టర్ కంపెనీల్లో, ఇస్రో, బోయింగ్ వంటి స్పేస్ సంస్థల్లో, ఈవీ బ్యాటరీ, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో విభాగాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 7 నుంచి 18 లక్షలు. విదేశీ పరిశోధక సంస్థల్లో చాలా ఎక్కుగా ఉంటుంది.

భవిష్యత్తు: చిప్స్, ఈవీలు, స్పేస్ టెక్నాలజీ బాగా పెరుగుతుండడంతో డిమాండ్‌కు తిరుగులేదు.

'క్రీ' ట్రెండ్స్

- ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ అనేవి ఇప్పుడున్న పాపులర్ ట్రెండ్స్
- పునరుత్పాదన ఇంధనాలు, ఈవీలపై అందరి దృష్టి ఉంది.
- క్వాంటమ్ టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ అనేవి అత్యంత డిమాండ్ ఉన్న రంగాలు.
- ఇప్పుడు సంప్రదాయ కోర్సులను ఇంటర్ డిసిప్లినరీ కోర్సులు రిప్లేస్ చేస్తున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ + ఏ రంగం అయితే ఆ రంగానికి సంబంధించిన కోర్సు దీనికి చేరుతోంది.
- ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రవేశపెట్టిన ఈ కోర్సులకు ఉద్యోగ అవకాశాలు అత్యంత ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే టెక్నలాజికల్ అడ్వాన్స్‌మెంట్స్, ఇండస్ట్రీ అవసరాలతోపాటు, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, నేషనల్ ఏఐ స్ట్రాటజీ మొదలైన ప్రభుత్వ చొరవలకు అనుగుణంగా డిజైన్ చేసిన కోర్సులు ఇవి.

ఎన్ఐటీల్లో

- **ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్:** వరంగల్, తిరుచ్చి, సూరత్‌కల్, కాలికట్, పాట్నాల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఇంజనీరింగ్:** కురుక్షేత్ర, నాగపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **బయోటెక్నాలజీ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్:** రూర్కేలా, దుర్గాపూర్, వరంగల్‌లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.



- **మానుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్ ఇండస్ట్రియల్ అండ్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి, జంషెడ్‌పూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- **మెకట్రానిక్స్ ఇంజనీరింగ్:** కాలికట్, పాట్నా ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **పెట్రోలియం ఇంజనీరింగ్, ఎనర్జీ ఇంజనీరింగ్:** కాలికట్, సూరత్‌కల్‌లోని ఎన్ఐటీల్లో ఉంది.
- **స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి ఎన్ఐటీలో సివిల్ విత్ స్మార్ట్ టెక్నాలజీ కోర్సు ఉంది.
- **సైబర్, ఫిజికల్ సిస్టమ్స్(ఏఐ+ఐఓటీ=రోబోటిక్స్):** ఆంధ్రప్రదేశ్, మణిపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఉంది.

ఇంజనీరింగ్ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్స్ (బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ, బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్స్)

- క్వాంటమ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌తో ఇంజనీరింగ్ ఫిజిక్స్. ఇది బొంబే, మద్రాస్ ఐఐటీల్లో ఉంది.
- మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్. అన్ని ఐఐటీలు, పేరున్న ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- ఎకనామిక్స్ అండ్ డేటా సైన్స్. కాన్పూర్, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో ఉంది.
- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ సస్టయిన్‌బిలిటీ. బాంబే ఐఐటీలో, తిరుచ్చి ఎన్ఐటీలో ఈ కోర్సు ఉంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

అఖండ 2 కొత్త షెడ్యూల్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. 2021లో విడుదలై ఘనవిజయం సాధించిన 'అఖండ'కు ఇది సీక్వెల్. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ సినిమా కీలక షెడ్యూల్‌ను నేటి నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభించనున్నట్లు తెలిపారు మేకర్స్. బాలకృష్ణతో సహా ప్రధాన పాత్రధారులందరూ పాల్గొననున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

'కన్నప్ప' చిత్రంపై ఆ శివుడి అనుగ్రహం ఉండాలి



మంచు విష్ణు కథానాయకుడిగా ముఖేష్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా కేరళలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో మోహన్‌లాల్ మాట్లాడుతూ "ఇప్పుడంతా పాన్ ఇండియా ట్రెండ్ నడుస్తోంది. 'కన్నప్ప' చిత్రం అద్భుతంగా వచ్చింది. ఆ శివుడి అనుగ్రహం ఈ సినిమాపై ఉండాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ "మోహన్‌లాల్ గొప్ప నటుడు. సినిమా కోసం ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా పారితోషికంగా తీసుకోలేదు. ఆయన చూపించిన ప్రేమకు రుణపడి ఉంటాను. ఆయనతో కలసి నటించాలనుంది" అని చెప్పారు. మంచు విష్ణు మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇక నేను చెప్పాల్సిన పని లేదు. మీరు అల్రెడీ ట్రైలర్ చూశారు. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని అన్నారు.

అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి

● సినీ ప్రముఖులకు దిల్‌రాజు సూచన



'ప్రభుత్వం నుంచి అవార్డ్ వస్తున్నాయంటే చాలా జాగ్రత్తగా పురస్కారాలను స్వీకరించాలి. ఇది ఇండస్ట్రీలోని అందరికీ చెబుతున్నాను. భవిష్యత్‌లో ప్రభుత్వ పురస్కారాల ప్రకటన వచ్చినప్పుడు ఆ తేదీని డైరీలో నోట్ చేసుకొని... అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి. నా విజ్ఞప్తిని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను' అని నిర్మాత, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు అన్నారు. శనివారం నిర్వహించిన తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక విజయవంతమైన సందర్భంగా ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ 'షూటింగ్స్ ఉన్నా పక్కనపెట్టి పురస్కార గ్రహీతలు స్వయంగా అవార్డ్ ప్రధానోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలి. అది మన బాధ్యత. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సినీ పురస్కారాలను ఇవ్వబోతోంది. అందరికీ చెబుతున్నా... గుర్తు పెట్టుకోండి. ప్రభుత్వంతో సామరస్యపూర్వకంగా ముందుకెళ్లాల్సిన బాధ్యత ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరిపైన ఉంది' అని చెప్పారు. 'గద్దర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించి విజయవంతం చేశాం. ఆరునెలల నుంచి పడిన కష్టం ఫలించినందుకు చాలా ఆనందంగా ఉంది. సినీ పరిశ్రమలోని వారంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు బావుందంటూ చాలామంది ప్రశంసిస్తున్నారు. సీఎం గారు గంట సమయం ఇస్తానన్నారు. కానీ నా కోరిక మేరకు ఆయన రెండు గంటలకుపైగా ఉండడం ఉత్సాహాన్నిచ్చింది. ఇంత పెద్ద వేడుకలో ఏవైనా పొరపాట్లు జరిగి ఎవరి మనసైనా నొప్పించి ఉంటే వాళ్లకు టీజీఎఫ్‌డీసీ తరపున క్షమాపణలు చెబుతున్నాను' అని దిల్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ పాల్గొన్నారు.



'కుబేర' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

ఎస్.ఎస్.రాజమౌళి

"శేఖర్ కమ్ముల పైకి చూడ్డానికి చాలా సాఫ్ట్‌గా ఉంటారు. ఆయన్ని చూస్తూనే మనకి అలా అనిపిస్తుంది. కానీ ఆయన నమ్మిన సిద్ధాంతాల కోసం ఎంత దూరమైనా వెళ్లే మొండి పట్టుదల కలవారు. ఆయన నమ్మే సిద్ధాంతాలనే సినిమాలుగా తీస్తారు. ఆయనలోని ఈ గుణాన్ని నేను ఎంతో గౌరవిస్తాను. ఆయన ముందు ముందు కూడా ఇలానే మనకు మరిన్ని మంచి సినిమాలు అందించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమౌళి మాట్లాడుతూ "ట్రాన్స్ ఆఫ్ కుబేర' టీజర్ చూసి ఆశ్చర్యపోయాను. మేకింగ్ అద్భుతంగా ఉంది. తొలి రోజే సినిమాను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. నాగార్జున మాట్లాడుతూ "ధనుష్ మీ సినిమాలు చేశాను. సెట్స్‌లో మీరు పాత్రలోకి ఎలా పరకాయ ప్రవేశం చేస్తారో చూశాను. మీతో కలసి పనిచేయడం గొప్ప జ్ఞాపకం. ఇది కంప్లీట్‌గా శేఖర్ కమ్ముల సినిమా. ఈ చిత్రానికి ఆయనే హీరో" అని చెప్పారు. ధనుష్ మాట్లాడుతూ "ఇది 'సార్' తర్వాత నా రెండో తెలుగు చిత్రం. నిజానికి 'సార్' కంటే ముందే శేఖర్ కమ్ముల ఈ కథ చెప్పారు. మీ ముందుకు రావడానికి ఇంత టైమ్ పట్టింది. ఆయనో అద్భుత వ్యక్తి. చిన్నప్పటి నుంచి నాగార్జున సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనతో కలసి నటించడం మరిచిపోలేని అనుభవం. ఇది రెండు భిన్న ప్రపంచాల మధ్య జరిగే కథ" అని పేర్కొన్నారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "రాజమౌళి ఈ కార్యక్రమానికి రావడంతో 'కుబేర' చాలా పెద్ద సినిమా అయ్యింది. దర్శకుడిగా అప్పుడే 25 ఏళ్లు అయ్యాయా అనిపిస్తోంది. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. నిజాయితీగా తీసిన సినిమా ఇది. చాలా కొత్తగా ఉంటుంది. ట్రూ పాన్ ఇండియా చిత్రమిది. అందరికీ కనెక్ట్ అవుతుంది" అని తెలిపారు. నిర్మాత సునీల్ నారంగ్ మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇప్పుడేం మాట్లాడను. సినిమా విడుదలయ్యాక సక్సెస్ మీట్‌లో మాట్లాడుతా" అని అన్నారు. నిర్మాత పుస్కూర్ రామ్‌మోహన్ రావు మాట్లాడుతూ "ఇదో విభిన్న చిత్రం. నాగార్జున,ధనుష్ నటన ఈ సినిమాకే హైలెట్‌గా ఉండబోతోంది" అని అన్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథ



'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి తెరకెక్కించిన చిత్రం '8 వసంతాలు'. 'మ్యాడ్' ఫేమ్ అనంతిక సునీల్‌కుమార్ కీలక పాత్రలో నటించారు. రవితేజ దుగ్గిరాల, హనురెడ్డి కీలక పాత్రలు పోషించారు. నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ప్రేమంటే ఒక దశ మాత్రమే.. దిశ కాదు', 'మగాడి ప్రేమకు సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు, భాగ్యనగరాలు ఉన్నాయి.. ఆడదాని ప్రేమకు ఏమున్నాయి? మనసులోనే సమాధి చేసుకున్న జ్ఞాపకాలు తప్ప' వంటి సంభాషణలు సినిమాపై మరింత అంచనాలను పెంచాయి. ప్రధాన పాత్రధారుల నటన, అద్భుతమైన విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఇది మహిళా ప్రాధాన్యం ఉన్న కథ అయినా, ఇందులోని పాత్రలన్నీ కీలకమే. ప్రతీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఇదో స్వచ్ఛమైన ప్రేమ కథ. నిజజీవితాన్ని తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని పంచుతుంది" అని తెలిపారు.



భూ అంటే భూతం

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తమ్ముడు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. లయ వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలకపాత్రలు పోషిస్తున్నారు. జులై 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'భూ అంటే భూతం' అంటూ సాగే గీతాన్ని ఈ మంగళవారం విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

సినిమాకే హైలెట్‌గా

రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు.పి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ హీరో ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ సూర్యకుమార్ అనే శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు.



తాజాగా, ఈ సినిమాలో కీలకమైన టాకీ పార్ట్‌ను హైదరాబాద్‌లో షూట్ చేస్తున్నారు. రామ్, ఉపేంద్ర మధ్య తెరకెక్కుతోన్న ఈ కీలక సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇందులో రామ్ పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోందని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్- మెర్విన్.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ద్విచక్రవాహనం చోరీపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేటకు చెందిన వల్లభాపురం హేమకుమార్ గత నెల 29న బస్టాండ్ సెంటర్‌లోని సామ్రాట్ హోటల్ పక్కన ద్విచక్రవాహనాన్ని పార్కుచేసి ఐతానగర్‌లో జరుగుతున్న ఒక ఫంక్షన్‌కి మిత్రుని వాహనంపై వెళ్లాడు. ఫంక్షన్ నుంచి తిరిగి వచ్చి చూసేసరికి పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురియింది. అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బండి లాక్‌ను విరగగొట్టి బండిని అపహరించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో వెతికినా బండి ఆచూకీ తెలియకపోవడంతో హేమకుమార్ పోలీసులను ఆశ్రయించాడు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

వెంకటేశ్వరరావుకు డాక్టరేట్

తెనాలి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌కు చెందిన చీకటి వెంకటేశ్వరరావుకు అన్నామలై యూనివర్శిటీ డాక్టరేట్ అందించింది. కేఎల్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన హార్ట్ డిసీస్ డిటెక్షన్ ప్రిడక్షన్‌విత్ మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై పరిశోధన చేశారు. తమిళనాడులోని యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్న ఆయనను పలువురు అధ్యాపకులు అభినందించారు.



పల్లకి సేవ చేస్తున్న అర్చకులు

వైకుంఠపురంలో ఘనంగా పల్లకి సేవ

తెనాలి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయంలో ఆదివారం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున సాయంత్రం 6గంటలకు స్వామి, అమ్మవార్లను అలంకరించిన పల్లకిలో ఉంచి పూజలు చేసే కార్యక్రమం పునఃప్రారంభించారు. ప్రతి నెలా జరిగే కార్యక్రమాన్ని భక్తులు వీక్షించి స్వామి కృపకు పాత్రులు కావాలని ఈవో అనుపమ కోరారు. సేవలో పలు భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి: సీఐటీయూ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్, 15 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం చేబ్రోలులో ఉపాధ్యాయ భవనంలో సీఐటీయూ సమావేశం జరిగింది. కూటమి నాయకులు భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే జూలై 23, 24 తేదీల్లో గుంటూరులో జరిగే భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా పి.చౌడయ్య, మస్తాన్‌వలి, ఉపాధ్యక్షుడిగా రాజారావులను ఎన్నుకున్నారు.



విద్యార్థికి ఆర్థికసాయం అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

రాజారావు సేవలు చిరస్మరణీయం

● వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వేజెళ్ల

తెనాలి, మారీసుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్య కోసం వాకర్స్ క్లబ్ తెనాలి 2 మాజీ అధ్యక్షుడు పి.రాజారావు చేసిన సేవలు చిరస్మరణీయమని వాకర్స్ క్లబ్ తెనాలి 2 అధ్యక్షుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని వాకర్స్ క్లబ్ తెనాలి 2 కార్యాలయంలో వాకర్స్ క్లబ్ 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ మాజీ అధ్యక్షులు పి.రాజారావు 5వ వర్ధంతిని పురస్కరించుకొని పేద విద్యార్థికి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఆయన కుటుంబ సభ్యులు అందించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితానికి నడక ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జి.విజయసాయి, పి.దీప్తి, జి.మురహరిరావు, భుజంగరావు, సత్యనారాయణరాజు, దేవభక్తుని ఉమామహేశ్వరావు, తుమ్మల సత్యనారాయణ, విజయ, జ్యోతి, అనురాధ, శ్రీలత, జీఎల్ ప్రసన్నకుమారి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల...



దెబ్బతిన్న కళా వేదిక ముందు భాగం



సగం కూలిన వేదిక ప్రహరీ

- 2014లో రూ.25 లక్షలతో కళావేదిక నిర్మాణం
- నాడు కళాకారుల ప్రదర్శనలతో శోభాయమానం
- నిర్వహణ లోపంతో నేడు కళావిహీనం
- అధికారులు దృష్టి సారిస్తేనే పూర్వవైభవం

తెనాలి, మారీసుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కళలకు, కళాకారులకు కేంద్రంగా విరాజిల్లుతున్న తెనాలిలో ఏర్పాటుచేసిన కళావేదిక (ఓపెన్ ఆడిటోరియం) నేడు కళ తప్పింది. స్థానిక రామలింగేశ్వరపేట జంధ్యాల వారి వీధి తడికల బడి ప్రాంగణంలో అప్పటి శాసనసభ సభాపతి నాదెండ్ల మనోహర్ 2014లో రూ.25 లక్షలతో వివిధ ప్రదర్శనలు నిర్వహించేకునేలా కళావేదికను నిర్మించారు. అప్పటి నుంచి కళాకారులు తమ కళలను ప్రదర్శించేందుకు ఓ వేదిక సమకూరడంతో కళలకు ప్రోత్సాహాన్ని ఇచ్చే కళాకారులకు మరింత ప్రోత్సాహం లభించినట్లయింది. కళావేదిక మీద ప్రదర్శన బృందాలు వేచి ఉండేందుకు రెండు గదులు ఉండగా ప్రదర్శనకు వేదికతోబాటు సుమారు 3000 మంది వీక్షకులు వీక్షించేలా కళావేదిక విద్యుత్ కాంతులతో సుందరంగా నిర్మించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ కళానైపుణ్యాన్ని ప్రేక్షల ముందు ఉంచేలా అనేక సాంఘిక, పౌరాణిక నాటకాలు, నాటికలను ప్రదర్శిస్తూ ప్రేక్షకులను రజింపజేశారు. కాలక్రమేణా కళావేదిక కళ కోల్పోతూ నేడు అధ్వానంగా కనిపిస్తోంది. ప్రధానంగా కళలను, కళాకారులను ప్రోత్సహించేలా గత వైసీపీ ప్రభుత్వం బాధ్యతలు తీసుకోకపోవడంతో కళాకారులు సైతం సొంత నిధులను వెచ్చించి ప్రదర్శనలు జరపకపోవడంతో వేదిక బాగోగులు చూసే పురపాలక సంఘం వేదికను విస్మరించటంతో నానాటికీ ఒక్కొక్కటిగా దెబ్బతింటూ ప్రస్తుతం దాని రూపురేఖలు మారిపోయాయి. కళావేదిక ప్రాంగణం చుట్టూ నిర్మించిన ప్రహరీ ఎదురు భాగం సగానికి పైగా విరిగిపోయింది. వేదిక ముందు భాగం సిమెంట్ బేస్‌లెవల్ ఊడి రంధ్రం ఏర్పడింది. అందులో నుంచి ఇసుక ఇతర మెటీరియల్ బయటకు పోతుండటంతో ప్రాంగణంపై భాగం కుంగే పరిస్థితి నెలకొంది. వేదికపై నిర్మించిన గదులకు అద్దాలు పగిలి విద్యుత్ వైర్లు బోర్డులు సైతం పగిలి ప్రమాదకరంగా ఉన్నాయి. పరిసర ప్రాంతాల్లో రాత్రుళ్లు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రాంగణంలో డిస్పోజల్ గ్లాసులు, మద్యం బాటిళ్లు, వాటర్ బాటిల్స్ వంటివి చుట్టూ పేరుకుపోతున్నాయి. ప్రేక్షకులకు ఆనందాన్ని పంచే కళావేదిక కళతప్పి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంపై కళాకారుల సంఘాలు, పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కళావేదిక (ఓపెన్ ఆడిటోరియం)పై ప్రత్యేక దృష్టిపెట్టి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తే తిరిగి కళావేదికకు పూర్వ వైభవం వస్తుందని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. కోట్ల రూపాలయ విలువ గలిగిన కళావేదిక కొందరు రాజకీయ పలుకుడి నాయకులు ఆక్రమణలకు గురిచేసి కల్యాణ మండపం వంటి వాటిని నిర్మించేందుకు పావులు కదుపుతున్నారని ఆరోపణ వస్తున్నాయి. ప్రభుత్వం యంత్రాంగం, ప్రజా ప్రతినిదులు ఈ కళావేదిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కళాకారులు, కళాభిమానులు కోరుతున్నారు.

వేగంగా కాల్వల మరమ్మతులు

● మంత్రి నాదెండ్ల మనోహర్



కట్టల బలోపేతంపై అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు ప్రారంభం నాటికి చివరి భూములకు సైతం సాగునీరందేలా కాలువల పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఆదివారం మండలంలోని అంగలకుదురు, కోపల్లె, గుడివాడ గ్రామాల్లో జరుగుతున్న పంటకాల్వలు, డ్రెయిన్‌ల పూడికతీత పనులను మంత్రి స్వయంగా పరిశీలించారు. కాలువలో ఎక్సకవేటర్‌తో పూడికతీస్తున్న విధానాన్ని కట్టల బలోపేతం చేసే తీరును క్షేత్రస్థాయిలో చూసి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక రైతులతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. అందుకు పంటల సాగు ప్రారంభానికి ముందు చేపట్టాల్సిన కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులు చేపట్టకపోవడమేనన్నారు. ఫలితంగా రైతుల పంటలకు సకాలంలో నీరందక నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకూడదని ప్రణాళికతో కాలువల మరమ్మతులు, కట్టల బలోపేతానికి పనులు చేపట్టామన్నారు. డెల్టా ప్రాంతంగా పేరుగాంచిన తెనాలి నియోజవర్గంలో కాలువల పూడికతీత పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. దాదాపు రూ.కోటి 43లక్షలతో కోపల్లె గుడివాడ, అంగలకుదురు వంటి ప్రాంతాల్లో 47కిలోమీటర్ల మేర పనులు వేగంగా జరుగుతున్నాయని, మరో నాలుగైదు రోజుల్లో పూర్తయ్యేలా ఆదేశించామన్నారు. ప్రతి రైతు చివరి సాగుభూమికి నీరు పుష్కలంగా అందేలా పనిచేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

శరవేగంగా తెనాలి ప్రాంత అభివృద్ధి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంవత్సర కాలంలోనే తెనాలి ప్రాంతం అభివృద్ధి పథంలో నడుస్తున్నదని గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి చెప్పారు. కూటమి ప్రభుత్వం సంవత్సర పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వీరవల్లి మురళి, అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం తెనాలి క్యాంప్ కార్యాలయంలో మంత్రి మనోహర్‌ను కలిసి దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముప్పవరపు సాంబశివరావు, నిజామ్, పలువురు గణేష్‌యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగలకుదురు అభివృద్ధికి కృషి

అంగలకుదురు గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఆదివారం మండలంలోని అంగలకుదురులో మంత్రి మనోహర్ పర్యటించారు. తెనాలి - గుంటూరు ప్రధాన రహదారి వెంట ఉన్న చెరువును పరిశీలించారు. రాబోయే రోజుల్లో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ వంటివి ఏర్పాటు చేసి వ్యాయామానికి తోడ్పాటు అందిస్తామన్నారు. అదే విధంగా అపరకర్మలశాల వంటివి ఏర్పాటుకు కూడా కృషి చేస్తానని మంత్రి మనోహర్ తెలిపారు. గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా విడనాడాలి

పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు స్వచ్ఛందంగా విడనాడాలని మంత్రి మనోహర్ సూచించారు. ఆదివారం పట్టణంలోని జేఎంజే కళాశాల సమీపంలో కాలువల్లో భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశీలించిన మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో వినియోగించే ప్లాస్టిక్ వ్యర్థాలైన కవర్లు, వాటర్ బాటిల్స్ వంటివి కాలువల గుండా రావడాన్ని గుర్తించారు. ప్లాస్టిక్ పెనుభూతం రోజు రోజుకు పెరుగుతుందన్నారు. ఇది పర్యావరణానికి ప్రమాదకరమని చెప్పారు. ప్రజలు మూడు బుట్టల విధానం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. రోడ్లపైన, కాలువల్లో వేయవద్దన్నారు. సాధ్యమైనంతవరకు ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ విడనాడాలని ఆయన కోరారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంగలకుదురు చెరువు అభివృద్ధిపై మాట్లాడుతున్న మంత్రి మనోహర్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే నరేంద్ర తదితరులు

పేదలకు సంజీవని సీఎం సహాయనిధి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు సంజీవిని లాంటిదని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని అన్నారు. సీఎం సహాయనిధి నుంచి పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన భీమవరపు సాంబిరెడ్డికి రూ.1,54,091, వెనిగండ్ల గ్రామానికి చెందిన నారి ఏసుదాసుకు రూ.1,53,415, సురవరపు శివ శంకర్‌కు రూ.86,750, ఉప్పలపాడు గ్రామానికి చెందిన దంతాల పద్మావతికి రూ.1,05,343, పెదకాకాని గ్రామానికి చెందిన కూరపాటి హైమరావుకు రూ.46,160 చెక్కులను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌లు అందజేశారు.

పంట కాలువ పూడికతీత పనులు ప్రారంభం



కాలువ మరమ్మతు పనులకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

పొన్నూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో పంట పొలాల్లోని మురుగునీరు పారే కాలువల పూడికతీత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. పాండ్రపాడు మీడియం డ్రెయినేజీ కాలువ మండల పరిధిలోని వల్లభరావుపాలెం, సీతారామపురం, ఉప్పరపాలెం, పెదపాలెం, కాకుమాను మండలంలోని పాండ్రపాడు, గరికపాడు గ్రామాల పరిధిలో మురుగునీరు పారుతోంది. అయితే గత ఐదేళ్లుగా కాలువలకు మరమ్మతులు చేయకపోవడం, పూడికతీత తీయకపోవడంతో ఆయా గ్రామాల పరిధిలో వర్షపునీరు వరద నీరు పంట పొలాలను ముంచెత్తి పెద్దఎత్తున పంట నష్టం జరిగింది. తమ సమస్యను రైతులు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు మురుగు కాలువ పూడికతీత పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, డీసీ ఛైర్మన్ గనిపిశెట్టి రామకృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు బొద్దులూరి వెంకటేశ్వరరావు, చలంశెట్టి సీతారామయ్య, సౌపాటి వెంకట్రావు, మదమంచి వీరయ్య, బొప్పన బాపనయ్య, జనసేన నాయకులు ఎలవర్తి వెంకటేశ్వరరావు, రైతులు పొట్టూరి హనుమత్‌దుర్గాప్రసాద్, అంబటి శ్రీనివాసరావు, సుబ్బారావు, ఏఈ గుమ్మడి శిరీష తదితరులు పాల్గొన్నారు.

శీతలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



శీతలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న శలపాడు వాసులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శలపాడు గ్రామంలో ఆదివారం శీతలమ్మ తల్లి, బొడ్డురాయికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఏరువాక పూర్ణిమ పూజల్లో భాగంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

తెనాలి అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): హేమాద్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ శ్రోతలను అలరించింది. బోసురోడ్డులోని శ్రీవాసవి ఆలయ ప్రాంగణంలో ఆదివారం గాన విధుషి గద్దే వెంకటరామకుమారి స్మారక ఉత్సవం నిర్వహించారు. ప్రఖ్యాత గాయకుడు మోదుమూడి సుధాకర్‌ను, రామకుమారి సంగీత పురస్కారంతో సన్మానించారు. అన్నవరపు రామస్వామి, ఎంవీఎస్ ప్రభాకర్, బ్రహ్మానందశాస్త్రిలు ప్రసంగించారు. త్యాగరాజ కీర్తనలు, అన్నమయ్య కీర్తనలతో గాయకులు ఆకట్టుకున్నారు. చంద్రకాంత్, చరణ్, వాయిద్య సహకారం అందించగా కార్యదర్శి సుజాత పర్యవేక్షించారు.



అంజుమన్ కమిటీకి విరాళాలు అందజేస్తున్న దాతలు

అంజుమన్ కమిటీకి రూ.2లక్షల విరాళం

పొన్నూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో నిర్మాణంలో ఉన్న అంజుమన్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్‌కు ఆదివారం రూ.2లక్షల విరాళాలు అందాయి. బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్‌కయ్యూన్ రూ.1లక్ష, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ యగ్భాల్ జ్ఞాపకార్థం కుమారుడు మహ్మద్‌ఖాసీం రూ.1లక్ష విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్, షేక్ బాబ్జీ, మహ్మద్‌గౌస్, షేక్ మౌలాలీ, అబ్దుల్ వజీగ్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యం జ్ఞాపికతో సత్కరిస్తున్న కాంతారావు, హనుమంతరావు

బాల బాలికల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించాలి

● డీఎల్ కాంతారావు

తెనాలి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బాల బాలికల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించాలని కాకతీయ సొసైటీ ఛైర్మన్ డీఎల్ కాంతారావు పేర్కొన్నారు. పాఠశాలలో ఆదివారం ప్రబంధకారిణి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న పలు రుగ్మతలను నివారించేందుకు పాఠశాల నుంచే కృషి ప్రారంభం కావాలన్నారు. ముఖ్యదాతగా వ్యవహరిస్తున్న పారిశ్రామికవేత్త సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ అధ్యక్షుడు అవ్వారు లత, కార్యదర్శి యర్రంశెట్టి హనుమంతరావు, కొత్త కిర్మణయి, గడ్డం శ్రీధర్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

గుంటూరులోనే పంచకర్మ వైద్యసేవలు

● కేరళ ఆయుర్వేద నిపుణుడు కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద పంచకర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేదని, కేరళ వారి అనుబంధంతో అన్ని సదుపాయాలతో వంద పడకల సామర్థ్యంతో గుంటూరులోనే ఆయుర్వేదిక్ ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చినట్లు శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఛైర్మన్, ప్రముఖ కేరళ ఆయుర్వేద ప్రధాన వైద్య నిపుణుడు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం పెదకాకాని మండలం అగతవరప్పాడులోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకుడు తల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పురాతన మైనదని, అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఈ వైద్యవిధానంలో చక్కటి పరిష్కారాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం జరిగిన వైద్యశిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు డాక్టర్లు భాను కశ్యప్, భావన, మోనిక, రాహుల్ చంద్ర, రోగుల బీపీ, షుగర్ పరీక్షలతో పాటు నాడి పరీక్షలు చేశారు. శిబిరంలో 150 మంది రోగులు వైద్య సేవలు పొందగా, వీరికి రూ.లక్ష విలువైన మందులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ టీ చిన్న పోలిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాషా, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరమ్మ, ఆసుపత్రి మేనేజర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి

తెనాలి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి శ్రీశ్రీ 42వ వర్ధంతి ఆదివారం నాజరుపేట కళావేదికలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేదిక జిల్లా అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సామాజిక చైతన్యాన్ని రగిల్చే కావ్యాలు రచించి సామాన్యుడి ముంగిట సాహితీ రంగ వల్లులు శ్రీశ్రీ దిద్దారని చెప్పారు. ఆయన రచించిన మహా ప్రస్థానం శ్రామిక జనులకు భగవద్గీతగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఆళ్ళ నాగేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, ప్రేమ్‌కుమార్ యోహాన్, రఘునాథరావు, సుజాత పాల్గొన్నారు.



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వేదిక సభ్యులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

నేడు సాయిమందిర్ వార్షికోత్సవం

పెదనందిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిమందిర 26వ వార్షిక వేడుకలకు ఆదివారం ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం కాగడ హారతి, 108 కలశాలతో గ్రామంలో ఊరేగింపుగా వచ్చి స్వామికి మంగళస్నానాలు, చీరాల గాయత్రీ పరివారిచే 9గంటలకు పంచకుండీగాయత్రీ హోమం, ప్రత్యేక హారతి, సాయంత్రం బాబా ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు గ్రీవెన్స్

కాకుమాను, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ జరుగుతుందని తహసీల్దార్ వెంకటస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని ప్రజల నుంచి ఫిర్యాదుల అర్జీలను వెంటనే పరిష్కరించడానికి కృషి చేయనున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

బ్రహ్మానందరెడ్డికి జాతీయ పర్యావరణ అవార్డు

మంగళగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ పర్యావరణ సంస్థ కర్ణాటక లోని బెంగళూరు పట్టణంలో నిర్వహించిన జాతీయ పర్యావరణ అవార్డుల మహోత్సవంలో మంగళగిరికి చెందిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఏపీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డికి జాతీయ పర్యావరణ అవార్డు లభించింది. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిక శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

ఉన్నత విద్యపై అవగాహన సదస్సు

తాడేపల్లి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు మైలు రాయి లాంటి ఉన్నత విద్యపై అవగాహనా సదస్సులు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర గ్రామ, వార్డ్ సచివాలయాల డైరెక్టర్ ఎం శివప్రసాద్ (ఐఎఫ్ఎస్) అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని గౌడకల్యాణ మండపంలో ఆదివారం ఈసీజీ, స్ఫూర్తి గ్లోబల్ ఆర్గనైజేషన్ అమెరికా టీం ఆధ్వర్యంలో జరిగిన ఉన్నత విద్యా అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విద్యలో సరైన దిశానిర్దేశం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



దుగ్గిరాలలో శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

దుగ్గిరాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల రైలుపేటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రవణానక్షత్రాన్ని పురస్కరించుకుని, ఉదయం స్వామికి ప్రత్యేకాభిషేకాలు జరిపి, స్వామివారిని 23రకాల పుష్పాలతో అలంకరించారు. గ్రామానికి చెందిన కొంగర శరత్‌చంద్ర దంపతులు కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు గ్రామంలోని భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కనుల పండువగా జరిగిన కల్యాణోత్సవం అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.


పెద్దిరెడ్డి వ్యాఖ్యలపై కొల్లా ఆగ్రహం

కాకుమాను, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతీకార రాజకీయాలు చేస్తే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రజల్లో తిరిగేవారా అని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి ప్రశ్నించారు. కాకుమానులో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరులో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డితో మిలాఖత్ అయిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనంతరం చంద్రబాబు నాయుడు మీద చేసిన విమర్శలపై కొల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి చేసిన అక్రమాలు, దౌర్జన్యాలు రాష్ట్ర ప్రజలు మరువలేదని అన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

తుళ్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కోడి పందాలు వేస్తున్న నలుగురిని తుళ్లూరు పోలీసులు ఆదివారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15వేలు నగదు పందెంలో చనిపోయిన కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. నెక్కల్లు గ్రామం సమీపంలో కోడి పందాలు వేస్తున్నట్టు పోలీసులకు సమాచారం రావటంతో దాడి చేసి పట్టుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు తుళ్లూరు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు.

ప్రమాదకరంగా మలుపు



ప్రమాదకరంగా ఉన్న తానాపాతి చెరువు వద్ద రోడ్డు మలుపు

తుళ్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు పరిధిలోని తానాపాతి చెరువు మలుపు ప్రమాదకరంగా ఉంది. మొదటి నుంచి ఇలాగే ఉండటంతో అనేక సార్లు వాహన ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణా లు పోగొట్టుకున్నారు. కొంత మంది క్షతగాత్రులయ్యారు. ఆ తరువాత రెండు మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్‌లు వేశారు. కొంత రోడ్డు వెడల్పు చేశారు. రాజధాని అభివృద్ధి పనుల్లో భాగంగా ఇటీవల కాలువను మలుపు దగ్గర తవ్వారు. వాహనాలు మలుపు వద్ద అదుపు తప్పితే కాలువలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. గుంటూరు నుంచి తుళ్లూరు ఆర్‌అండ్‌బీ ప్రధాన మార్గం కావటంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ప్రదేశంలో మలుపు సూచక బోర్డులు స్పీడ్ నియంత్రణ బోర్డులు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కోతుల స్వైరవిహారం

● గ్రామస్థులపై దాడులు చేస్తున్న తీరు
● భయాందోళనలో చిన్నారులు
● పట్టించుకోని అధికారులు




ఇళ్ల మధ్య తిరుగుతున్న కోతులు

తాడికొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో కోతులు స్వైరవిహారం చేస్తు న్నాయి. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కోతులు ఇళ్ల మధ్యలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. గుంపులు గుంపులుగా వచ్చి ఇళ్లలోకి దూరి వస్తువులను, ఎత్తుకెళ్తున్నాయి. ఉదయం, సాయంత్రం స్కూళ్లకు వెళ్లే వచ్చే విద్యార్థులు భయపడుతున్నారు. సాయంత్రం వేళల్లో ఆడుకోవడానికి బయటకు వెళ్లలేకపోతున్నారు. చిన్నారుల చేతుల్లో ఉన్న తినుబండారాలను లాక్కెళ్తున్నాయి. గుంపులు, గుంపులుగా ఇళ్ల మధ్యలోకి వచ్చి పెద్దపెద్దగా కేకలు వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గ్రామస్థులపై దాడులకు తెగబడి గాయపరుస్తున్నాయి. దీంతో గాయాలపాలైన వారు యాంటి వైరస్ ఇంజక్షన్లు చేయించుకోవాల్సి వస్తుంది. గతంలో కోతులను తరిమివేయటానికి ప్రత్యామ్నాయ చర్యలను పంచాయతీ అధికారులు చేపట్టారు. ప్రస్తుతం గ్రామాల్లో కోతులు బెడద ఎక్కువగా ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండి పోతున్నారు. కోతులు బెడద నుంచి ప్రజలను రక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యాలయంలో యోగాంధ్ర

● వివిధ యోగాసనాలతో ఆకట్టుకున్న నేచురోపతి విద్యార్థులు



యోగాసనాలు వేసిన నేచురోపతి విద్యార్థులు

విజయవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యాలయంలో ఈ నెల 9 నుంచి 15 వరకు యోగా సమావేశ్ నిర్వహించారు. ఆఖరి రోజైన ఆదివారం యోగా సమావేశ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన యోగా కార్యక్రమాన్ని ప్రతిరోజు ప్రతి వ్యక్తి సాధన చేయాలన్నారు. 2015లో మనదేశంలో మోదీ ప్రారంభించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 192 దేశాల్లో జరుపుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ యోగా వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఆరోగ్యాలయం కాలుష్య రహితంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విధానం హర్షణీయమన్నారు. రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా ఉంచాలని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గోకరాజు గంగరాజు మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ప్రశాంతతో పాటు భావోద్వేగాన్ని నియంత్రివచ్చన్నారు. యోగా శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు అంతర్లీన శాంతిని పెంపొందించడం, సంపూర్ణ ఆనందాన్ని ఆస్వాదించడంలో కీలకపాత్ర పోషిస్తుందని మంతెన సత్యనారాయణరాజు అన్నారు. జీవితంలో యోగా ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం ఆరోగ్యాలయ డాక్టర్ల బృందం, కేర్ కాలేజీ నేచురోపతి వైద్య విద్యార్థులు యోగా విన్యాసాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఆర్‌పి సూపరింటెండెంట్ బైరి శ్రీనివాస్, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన రోటరీ కృత్రిమ కాళ్ల పంపిణీ



కృత్రిమ కాళ్లు అమర్చిన దివ్యాంగులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న కృత్రిమ కాళ్ల పంపిణీ శిబిరం ఆదివారంతో ముగిసింది. మూడో రోజు 35మంది దివ్యాంగులకు ప్రభా ఫుట్ కృత్రిమ కాళ్లను అమర్చారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ జిల్లా 3150 గవర్నర్ శరత్‌చౌదరి మాట్లాడుతూ ఈ శిబిరంలో మొత్తం 128 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అమర్చడమే కాకుండా వారికి ఈ కాళ్లను ఉపయోగించి నడవడం, మెట్లు ఎక్కడం, కాలు ముడుచుకుని కూర్చోవడం వంటి విషయాలను నేర్పించారన్నారు. ప్రాజెక్టు శ్రీపాదం 128 మంది దివ్యాంగులకు మెరుగైన జీవితం గడిపేందుకు కారణమైందని, సాధారణ కృత్రిమ కాళ్ల కంటే ఈ ప్రభా ఫుట్ కాళ్లు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయని లబ్ధిదారులు చెబుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ భావ్‌నగర్ నుంచి విచ్చేసిన ప్రొస్తెటిస్ట్ అండ్ ఆర్థోటిస్ట్ డాక్టర్ రవి వాటలియ, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి, మంగళగిరి అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, హైదరాబాద్ డెక్కన్ డైరెక్టర్ త్రిపురనేని మురళీ, మంగళగిరి కార్యదర్శి అందె మురళీ మోహన్‌రావు, ప్రాజెక్టు చైర్మన్ అనిల్ చక్రవర్తి, డైరెక్టర్లు పారేపల్లి నిరంజన్ గుప్తా, వడ్లమూడి శ్రీనివాసరావు, చనుమోలు గోపాల్, రాజశేఖర్, రేవంత్‌కుమార్, క్రాంతికుమార్, నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

పివా మంగళగిరి అధ్యక్షుడిగా లక్ష్మీపెరుమాళ్లు



లక్ష్మీ పెరుమాళ్లును అభినందిస్తున్న పివా ప్రతినిధులు

మంగళగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళగిరి శాఖ అధ్యక్షుడిగా తాటిపాముల లక్ష్మీపెరుమాళ్లు నియమితులయ్యారు. మంగళగిరి షరాబ్ బజారులోని డాంగే కాంప్లెక్స్‌లో ఆదివారం సాయంత్రం అవ్వారు సత్యకృపాల్ డాంగే అధ్యక్షతన మంగళగిరి శాఖ సమావేశం జరిగింది. వయస్సు రీత్యా తాను అసోసియేషన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనలేకపోతున్నానని, నూతన అధ్యక్షుడిగా లక్ష్మీపెరుమాళ్లు పేరును ప్రతిపాదిస్తున్నానని డాంగే తెలిపారు. దీంతో ఆయన నియామకాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. 13 సంవత్సరాలపాటు అసోసియేషన్‌కు సేవలందించిన డాంగేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పివా శాఖా ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి విన్నకోట వెంకటేశ్వర్లు (కన్నా మాస్టారు), కోశాధికారి నీలి దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శి మురుగుడు లక్ష్మీనారాయణ, సభ్యులు అందె వెంకన్న, బట్టు నారాయణరావు, గోలి మోహనరావు, నందం బాబూరావు, కొల్లి పూర్ణ పాల్గొన్నారు.

వైభవంగా రాజమల్లేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం




ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న సదాశివరావు దంపతులు, పాల్గొన్న భక్తులు

తుళ్లూరు(దొండపాడు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భక్తి శ్రద్ధలతో దొండపాడు భ్రమరాంబ సమేత రాజమల్లేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక వేడుకలు ఆదివారం జరిగాయి. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామస్థుల సహకారంతో నాట్కో సంస్థ ప్రతినిధి నన్నపనేని సదాశివరావు, ఎండోమెంట్ అధికారులు కలిసి ఆలయ పునర్నిర్మాణం చేశారు. నూతన ఆలయం నిర్మాణం జరిగి పది సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. నాట్కో సంస్థ కార్యనిర్వాహణ ఉపాధ్యక్షుడు నన్నపనేని సదాశివరావు అమ్మవారికి శ్రీచక్రాన్ని అందజేశారు. శాస్త్రోక్తంగా శ్రీచక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. సదాశివరావు దంపతులు, భక్తులు హోమం, విఘ్నేశ్వర పూజ, మండపారాధన తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామికి గ్రామోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు.

చానల్‌లో తూటికాడను తొలగించాలి

● వ్యర్థాలతో నిండిపోయిన తీరు
● ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కానరాని అభివృద్ధి పనులు
● ఆవేదన చెందుతున్న రైతులు



గుంటూరు ఛానల్‌లో పేరుకుపోయిన తూటికాడ

తాడేపల్లి (ఉండవల్లి), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి నుంచి ప్రారంభమై పలు గ్రామాలకు సాగు నీరు, గుంటూరు పట్టణానికి తాగునీరు అందించే గుంటూరు ఛానల్‌లో తూటికాడ పేరుకుపోయింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నా ఇంకా ఛానల్ అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఛానల్ ఆసాంతం ఆయా గ్రామాల పరిధిలో తూటికాడ పేరుకుపోయి ఉంది. పలుచోట్ల వంతెనల వద్ద మరింత దట్టంగా అలుముకుంది. నీరు ముందుకు పోయే మార్గం కానరావడం లేదు. పైగా గుంటూరు చానల్ ఆసాంతం ఆయా చోట్ల వ్యర్థాలతో నిండిపోయి ఉంది. పలుచోట్ల గుంటూరు ఛానల్‌లోకి అపార్టుమెంట్ల నుంచి వ్యర్థాలను వదులుతుండడంతో నీరు కలుషితమైపోతోంది. అధికారులు స్పందించి ఛానల్ లోని తూటికాడ, వ్యర్థాలు తొలగించి సక్రమంగా నీరు పారేవిధంగా చర్యలు తీసుకోవాలని .. రైతుల వెతలు తీర్చాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఘనంగా పోలేరమ్మ ప్రతిష్ఠా మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ మూల విరాట్

వట్టిచెరుకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడు గ్రామ దేవత, తమ ఇలవేల్పుగా భావిస్తూ కొలుచు కొనే పోలేరమ్మ వారి 23వ ప్రతిష్ఠా మహోత్సవాన్ని గ్రామస్థులు వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం పోలేరమ్మకి పంచా మృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం దేవాలయ ప్రాంగణంలో వేద పండితులు కృష్ణ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు సమష్టిగా జలబిందెల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించుకున్నారు.

పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందజేస్తున్న టీడీపీ నేత కాట్రగడ్డ మధు తదితరులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో వధూవరులకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను ఆదివారం టీడీపీ నేతలు అందజేశారు. టెంట్ హౌస్ షేక్ ఘన్‌సైదులు మనుమడు వధూవరులు షేక్ మహమ్మద్‌రఫి-షేక్ రిజ్వానాలకు టీడీపీ స్థానిక నాయకులు పెళ్లి కానుక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కాట్రగడ్డ మధుసూదనరావు, గ్రామ అధ్యక్షుడు ఈ పూరి కోటయ్య, షేక్ ఇమాంసా, షేక్ జానీ, కొడవటి సురేష్, షేక్ మస్తాన్ బీ, షేక్ జాకీర్, అబ్దుల్ గఫూర్, షేక్ అన్వర్‌బాషా, షేక్ దరియా తదితరులు పాల్గొని వధూవరులకు నూతన వస్త్రాలు అందజేశారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

● 750 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

పెదనందిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నపర్రు కేఎస్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో కొల్లా కొండలరావు హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రేయాస్, రమేష్, డీవీసీ, పవన్ న్యూరో, సాయిరత్న, కృష్ణ స్కిన్ సెంటర్, అమరావతి కంటి హాస్పిటల్స్ వారి సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని దాత కొల్లా పద్మశ్రీ ప్రారంభించి మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని తెలిపారు. వైద్యులు డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్, వై రామకిషోర్, గద్దె సాయికృష్ణ, పోపూరి చాణక్య, భానుతేజ, నాదెండ్ల వేణు, కొల్లా వంశీకృష్ణ, కొల్లా చంద్రలేఖలు 750 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కాండ్రు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకి పాలాభిషేకం

ఫిరంగిపురం(పొనుగుపాడు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొనుగుపాడు గ్రామంలో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యా మంత్రి నారా లోకేశ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ చిత్రపటాలకు బాల బాలికలు పాలాభిషేకం చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా గ్రామంలో ఉన్న విద్యార్థులందరికీ రూ.13వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వటంపై సంతోషం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పచ్చా సుబ్బారావు, కర్లపూడి రాఘవరావు, ధూళిపాళ్ల కృష్ణ, పాతూరి సూర్యనారాయణ, కొంగర శ్రీను, దమ్మాలేడుకొండలు, బిహారి సాహెబ్, షేక్ హుస్సేన్, మాచారం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయిలో చేనేతకు గుర్తింపు

● ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మగ్గం నేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మంగళగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయిలో చేనేతకు తగిన గుర్తింపు తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. మంగళగిరి జాతీయ రహదారి వెంబడి తెనాలి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న సీఎస్‌ఆర్ హ్యాండ్లూమ్స్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. షోరూమ్‌లో ఏర్పాటు చేసిన నమూనా మగ్గంపై చేనేత వస్త్రాలను నేశారు. ఈ సందర్భంగా సీఎస్‌ఆర్ హ్యాండ్లూమ్స్‌లో పట్టు, కాటన్ వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్ తయారీ విధానం, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో చేనేత రంగం కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో చేనేత రంగం ప్రగతి పథంలో పయనిస్తుందని చెప్పారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

పెదనందిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై స్థానిక పోలీసుస్టేషన్లో ఆదివారం పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలపరిధిలోని పుసులూరు గ్రామానికి చెందిన బాలికకు అదేగ్రామానికి చెందిన కే నాగాంజనేయులు అనే వ్యక్తి బలవంతంగా తాళికట్టి ఫొటోలు తీసి, వీడియో కాల్ చేసి వేధిస్తూ, ఆ ఫొటోలను తన తండ్రికి చూపించి బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాలిక ఫిర్యాదులో తెలిపింది. ఈ మేరకు ఎస్‌ఐ అద్దంకి మధుపవన్ నాగాంజనేయులుపై పోక్సో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుగ్గిరాలలో యువకుడిపై కేసు

దుగ్గిరాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈమని గ్రామానికి బాలికతో ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఆమె ఇంటివద్ద ఉండగా అదేగ్రామానికి చెందిన తలమాల విక్కీ అనే యువకుడు తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు, దుగ్గిరాల పోలీసుస్టేషన్‌లో సదరు బాలిక చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరవి తెలిపారు.

ఆస్తి వివాదంలో దాడి.. ఒకరికి తీవ్రగాయాలు

దుగ్గిరాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవేంద్రపాడులో రెండు కుటుంబాల మధ్య ఆస్తివివాదం నేపథ్యంలో జరిగిన ఆదివారం రాత్రి దాడిలో ఒకరు తీవ్రంగా గాయపడగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పఠాన్ కరీముల్లా, రసూల్‌బీ, మహ్మద్‌ఖాన్‌లను అదే గ్రామానికి చెందిన షేక్ బాజి, షేక్ బుజ్జి, షమీమున్‌లు కొట్టి గాయపరిచి నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్రతో దాడిచేయడంతో తలకు బలమైన గాయాలతో ఉన్న కరీముల్లాను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కరీముల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరవి ఆదివారం తెలిపారు.

బాల్య మిత్రుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

వట్టిచెరుకూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్లూరు గ్రామంలోని సెయింట్ గ్జేవియర్స్ హైస్కూల్లో 1985-86 విద్యా సంవత్సరానికి సంబంధించిన బాల్య మిత్రుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హైస్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తెలుగు పండిట్ నాదెండ్ల అప్పారావు, సుందరరావు, జోజయ్యలను ఘనంగా సన్మానించారు.

మేడికొండూరులో బీజేపీ సంకల్ప సభ




సంకల్ప సభలో ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

మేడికొండూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ 11 సంవత్సరాల పరిపాలన పూర్తయిన సందర్భంగా మేడికొండూరులో ఆదివారం సంకల్ప సభ నిర్వహించారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నియోజకవర్గం కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో గత 11 సంవత్సరాల సుపరిపాలనతో పాటు పేదల సంక్షేమంలో చారిత్రాత్మక పురోగతి సాధించిందని తెలిపారు. బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు ఆమతి వెంకటరమణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చేకూరి వెంకటేశ్వరరావు, శేషగిరి, అశోక్, నరసింహ, చల్లారాశి రెడ్డి, మసీద్ జిక్రియ, బూత్ కన్వీనర్ బొడ్డు నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజాసేవకు పునరంకితమవుతామని ప్రతిజ్ఞ చేశారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం

పెదనందిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం అన్నారు. మండలపరిధిలోని కొప్పర్రులో ఆదివారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం పోరాటాలతో మొదలైందని, పోరాటాల ఫలితంగానే హక్కులు సాధించుకోగలిగామని, దీనికి సహాయ సహకారాలు అందించిన రాజకీయ పార్టీల నేతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కొప్పర్రు గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మన్నవ రవితేజ, కో-కన్వీనర్‌గా మన్నవ సుబ్బులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కారుమూరు అంకయ్య, కొండపాటూరు సుందరరావు, ఆనందబాబు, మల్లేశ్వరరావు, ఎస్ శ్యాంబాబు, మన్నవ జయరావు తదితరులు పాల్గొన్నారు.